సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 22-12-2023 15/-









సహజీవన భావనల పావురాయి

# గీటురాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 51 హైదరాబాద్
శుక్రవారం 22 డిసెంబర్ 2023 రూ.15-00
8 జమాదిఉల్ ఆఖిర్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

**శ్రేష్ఠమైన దానం**
**ఆకలిగొన్న వాడికి**
**కడుపునిండా**
**అన్నం పెట్టడం**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





**మళ్ళీ ఈవీఎం రగడ**

## లోపల...


| | | |
|---|---|---|
| పొగబాంబు దాడి | ...... | 04 |
| గాజా! | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)–10 | ...... | 08 |
| మళ్ళీ తెరపైకి హాదియా కేసు | ...... | 12 |
| అనురాగపు సంద్రం... అలక | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| అరబ్బుల ప్రత్యేకతలు | ...... | 20 |
| చరితార్థులు–2 : మున్షీ జకీయుద్దీన్ అహ్మద్ | ...... | 23 |
| దేశమును ప్రేమించు...! మంచి అన్నది పెంచు...!! | ...... | 24 |
| పరీక్ష | ...... | 27 |
| ఇహలోక జీవితం! పరలోక జీవితం!! | ...... | 28 |
| కశ్మీర్‌పై సుప్రీం తీర్పు | ...... | 30 |
| గోరఖ్‌పూర్ డాక్టర్ కఫీల్‌ఖాన్‌పై మరో కేసు | ...... | 33 |


**బస్సుల్లో ఆడాళ్ళు...**
**బస్టాండ్లో మగాళ్ళు**



కాంగ్రెస్ గ్యారంటీలతో
బస్సునిండా ఆడాళ్ళు
నిలిచేందుకు జాగలేక
బస్టాండ్‌లో మగాళ్ళు!
కొన్ని సీట్లు వాళ్ళకూ
కేటాయిస్తె మంచిదట
లేకుంటే వారిబతుకు
బస్టాండే అయితదట!!

*– యం.డి. ఉస్మాన్ ఖాన్*

## ఆలోచన

# పొగబాంబు దాడి

**పార్లమెంటుపై** మరోసారి దాడి జరిగింది. పార్లమెంటులోకి ఇద్దరు వ్యక్తులు పొగబాంబులతో ప్రవేశించారు. పార్లమెంటులో పొగబాంబులు విసిరారు. దట్టంగా అలుముకున్న పొగలో ఏం జరుగుతుందో ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. జీరో అవర్ జరుగుతున్నప్పుడు ప్రేక్షకుల గ్యాలరీలో ఉన్న ఇద్దరు లోపలికి దూకి, కుర్చీలపై, బల్లలపై దూకుతూ లోపలికి ఉరికి పొగ బాంబులు విసిరారు. భయాందోళనల వాతావరణంలో స్పీకర్ లోక్ సభను వాయిదా వేశారు.

ఇరవై రెండేళ్ళ క్రితం కూడా ఇదే రోజున అంటే 2001 డిసెంబర్ 13వ తేదీన పార్లమెంటుపై దాడి జరిగింది. అప్పుడు కూడా బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఇప్పుడు కూడా బీజేపీయే అధికారంలో ఉంది. అప్పుడు కూడా శీతాకాల సమావేశాలు జరుగుతున్నప్పుడే దాడి జరిగింది. అప్పుడు జరిగిన దాడిలో దుండగులు ప్రాణాంతక ఆయుధాలు ధరించి వచ్చారు. ఇప్పుడు కేవలం భయపెట్టే పొగబాంబులు మాత్రమే వాడారు. అప్పుడు దాడిని జరక్కుండా పార్లమెంటు బయటే అడ్డుకోవడం జరిగింది. ఇప్పుడు పార్లమెంటులోకి ప్రవేశించినా కనిపెట్టి అడ్డుకోలేక పోయారు. ఏది ఏమైనా పార్లమెంటుపై దాడులు జరిగిన రెండు సంఘటనలు బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే జరగడం ఆసక్తి కరమైన యాధృచ్ఛికం.

ఈసారి లోక్సభలో ప్రవేశించి పొగబాంబులు విసిరిన దుండగులకు ప్రవేశ పాసు కోసం సిఫారసు చేసింది బీజేపీ సభ్యుడు ప్రతాప్ సిన్హా. పార్లమెంటు లోపల, పార్లమెంటు బయట కూడా పొగబాంబులు విసిరారు. ఈ దాడి చేసింది ఖలిస్తానీలంటూ ఒక ప్రచారం మొదట ముందుకు వచ్చింది. కాని పార్లమెంటు లోపలికి వెళ్ళి దాడి చేసిన వారిలో ఒకడి పేరు సాగర్ శర్మ, రెండవ వాడి పేరు మనోరంజన్. బయట ఉండి పొగబాంబులు విసిరిన వారిలో ఒక అమ్మాయి పేరు నీలం. లాతూరుకు చెందిన అన్మోల్ షిండే. ఈ నలుగురు విద్యార్థులని వార్తల్లో వచ్చింది. వీళ్ళు నిరంకుశ నిర్ణయాలకు వ్యతిరేకంగా, మణిపూర్ హింసపై మోడీ మౌనానికి వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు తెలుస్తోంది. వీళ్ళకు ఏ సంస్థతోను సంబంధమున్నట్లు ఇంతవరకు తెలియలేదు.

ఒకవైపు పార్లమెంటుపై దాడి జరిగిన ఈ పరిస్థితుల్లో మన సోకాల్డ్ నేషనల్ చానళ్ళ ప్రతినిధులు అక్కడ చేసిన రిపోర్టింగ్ పై అనేక విమర్శలు వచ్చాయి. బయట విసిరిన ఒక పొగబాంబు కేసింగ్ కోసం జరిగిన పెనుగులాటలను కూడా చాలా మంది చూశారు. నిజానికి ఆ పొగబాంబు విచారణాధికారుల చేతికి ఇవ్వాలి. నేరపరిశోధనకు ఉపయోగపడే వాటిని కూడా వార్త కోసం వాడుకునే ప్రయత్నంలో అక్కడ మీడియా సృష్టించిన తమాషా చూస్తే దేశంలో మీడియా పరిస్థితి పట్ల తీవ్రమైన నిరాశ కలుగుతుంది.

పార్లమెంటుపై 2001లో దాడి జరిగిన రోజునే 2023లో కూడా ఈ దాడి జరిగింది. సాధారణంగానే పార్లమెంటులో భద్రత పటిష్టంగా ఉంటుంది. ఈరోజు మరింత గట్టి భద్రత ఉండ వలసింది. ప్లాస్టిక్ కేసింగ్ ఉన్న పొగబాంబును మెటల్ డిక్టేటర్ గుర్తు పట్టకపోవచ్చు. యధాలాపంగా చేసే తనిఖీలో బూట్లలో దాచుకున్న బాంబు దొరక్కపోవచ్చు. కాని బూట్లలో బాంబు దాచుకుని నడుస్తున్న వ్యక్తి నడకను, ప్రవర్తనను చూసి సుశిక్షితులైన భద్రతా సిబ్బందికి అనుమానం రావాలి కదా. అలా ఎవరికీ ఎలాంటి అనుమానమూ రాలేదు.

గతంలో కూడా హెూంమినిస్ట్రీ స్టిక్కరు పెట్టుకున్న ఒక అంబాసిడర్ కారులో వచ్చిన దుండగులు చాలా తేలిగ్గా పార్లమెంటు ఆవరణలోకి వచ్చేశారు. కాల్పులు ప్రారంభించి తొమ్మిది మందిని చంపేశారు. ఇలాంటి సంఘటన జరిగి ఉన్నప్పటికీ పార్లమెంటు భద్రత విషయంలో ఇంత పెద్ద వైఫల్యం మరోసారి చోటు చేసుకోవడం ఆందోళనకరమైన పరిణామం. ఈ వైఫల్యం బీజేపీ ప్రభుత్వానిదే.

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాల చిట్టా చాలా పెద్దది. పుల్వామాలో వైఫల్యం బీజేపీ ప్రభుత్వానిదే. యురిలో కూడా విఫలమయ్యారు. ఇప్పుడు జరిగిన దాడి చాలా ఆందోళనకరమైనది. లోక్ సభలో ప్రవేశించిన వాళ్ళు విసిరింది ప్రమాదరహితమైన పొగబాంబే కావచ్చు, కాని నిజమైన బాంబులే వారి చేతుల్లో ఉండి ఉన్నట్లయితే ఏం జరిగి ఉండేదనే విషయం ఆలోచిస్తే గుండెలు అవిసి పోతున్నాయి.

ఈ వైఫల్యాల నుంచి గుణపాఠాలు గ్రహిస్తామా లేదా అన్నది ఆలోచించవలసిన ప్రశ్న.

అబ్దుల్ వాహెద్




**హమాస్ ఇస్రాయీల్‌పై** దాడి చేసిన తర్వాతి నుంచి గాజాపై ఇస్రాయీల్ కొనసాగిస్తున్న అమానుష దాడులన్నింటినీ అమెరికా సమర్థిస్తూ వస్తోంది. కాని ఇటీవల అమెరికాకు కూడా సమర్థిం చడం సాధ్యం కాని పరిస్థితి తలెత్తింది. గాజాలో హమాస్‌ను అంతమొందిస్తామంటూ ఇస్రాయీల్ ప్రారంభించిన దాడులు నిజానికి హమాస్ సాయుధులను ఏమీ చేయలేకపోయాయి, కాని అమాయక గాజా ప్రజలను చంపుతున్నాయి. దాదాపు 18 వేల మంది మరణించినట్లు తెలుస్తోంది. గాజాను శిధిలాల గుట్టగా మార్చేసినా హమాస్‌ను ఇస్రాయీల్ పూర్తిగా అంతం చేస్తుందని చెప్పడం సాధ్యం కాని పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇస్రాయీల్ వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి. అమెరికాలోను పాలస్తీనా పట్ల మద్దతు పెరుగు తోంది. ఈ పరిస్థితి అమెరికా అధ్యక్షుడికి కూడా ఇబ్బందికరంగా మారింది. మొన్న ఒక కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు మాట్లాడుతూ ఇస్రాయీల్ రక్షణ బాధ్యత అమెరికాపైనే ఉందని, అయితే ఇస్రాయీల్‌కు అమెరికా కన్నా ఎక్కువగా యూరోపియన్ యూనియన్ బలం ఉందని అన్నాడు. కాని ఈ మద్దతును ఇప్పుడు ఇస్రాయీల్ కోల్పోతోందని కూడా ఆయన చెప్పాడు. ఎందుకంటే ఇస్రాయీల్ గాజాపై బాంబుదాడులు చేస్తూ అమాయక ప్రజలను చంపడమే దానికి కారణం.

హమాస్‌ను అంతమొందించే హక్కు ఇస్రాయీల్‌కు ఉందని కూడా ఆయన చెప్పాడు. అమెరికా అధ్యక్షుడు ఈ మాటలు చెప్పగానే ఇస్రాయీల్ ప్రధాని తమకు అమెరికా పూర్తి మద్దతి స్తోందని, గాజాపై దాడులకు అమెరికా అధ్యక్షుడి పూర్తి మద్దతు ఉందని అన్నాడు. కాని అమెరికా అధ్యక్షుడు ఈ మద్దతును కొనసాగించడం కష్టమే. ఎందుకంటే డెమొక్రటిక్ పార్టీలో కూడా ఇప్పుడు ఇస్రాయీల్ వైఖరి పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

డిసెంబర్ 12వ తేదీన ఐక్యరాజ్య సమితిలో గాజా యుద్ధాన్ని తక్షణం ఆపాలన్న తీర్మానానికి అనుకూలంగా ఇండియా కూడా ఓటు వేసింది. ఇంతకు ముందు ఐక్యరాజ్యసమితిలో ఇలాంటి

తీర్మానం వచ్చినప్పుడు ఇండియా తటస్థవైఖరి తీసుకుందని గమనించాలి. ఇప్పుడు ఇండియా వైఖరి కూడా మారింది. ఈ సారి తీర్మానానికి 153 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. తీర్మానాన్ని వ్యతిరేకించిన దేశాలు కేవలం పది మాత్రమే. ఇందులో ఇస్రాయీల్, అమెరికాలతో పాటు మరికొన్ని పాశ్చాత్య దేశాలున్నాయి. మరో 23 దేశాలు ముఖ్యంగా యూరప్ దేశాలు తటస్థ వైఖరి తీసుకున్నాయి. ఇంతకు ముందు ఇండియా కూడా ఇదే వైఖరి తీసుకుంది. కాని ఇప్పుడు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసింది.

ఐక్యరాజ్యసమితి తీర్మానంలో హమాస్ ఉగ్రదాడి గురించి ప్రస్తావన వచ్చేలా చేయాలని అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు, ఇండియా కూడా ప్రయత్నించాయి. కాని అది సాధ్యం కాలేదు. ఈసారి తీర్మానంలో కూడా గతంలో మాదిరిగానే ఐక్యరాజ్య సమితి హమాస్ దాడులను ప్రస్తావించలేదు. అయినప్పటికీ ఇండియా తన వైఖరిని మార్చుకుంది. డిసెంబర్ 8వ తేదీన కూడా ఇలాంటి ఒక తీర్మానం భద్రతామండలిలో వచ్చింది. కాని అమెరికా వీటో చేసింది.

హమాస్ దాడి చేసిన రోజున వెంటనే ప్రధాని మోడీ ఇస్రాయీల్ కు అనుకూలంగా, ఇస్రాయీల్‌తో సంఘీభావం ప్రకటిస్తూ ట్వీటు చేశారు. మూడు రోజుల తర్వాత ఇస్రాయీల్ ప్రధానితో భారత ప్రధాని మోడీ ఫోనులో మాట్లాడారు. భారతదేశం ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ఈ రెండు సందర్భాల్లోను గాజాలోని ప్రజల గురించి ప్రస్తావనే రాలేదు. హమాస్ దాడి జరిగిన ఐదు రోజుల తర్వాత భారత విదేశాంగ శాఖ నుంచి వచ్చిన ప్రకటనలో రెండు దేశాల పరిష్కారం గురించి, పాలస్తీనా గురించి మాట్లాడారు. ఆ తర్వాత కూడా ఐక్యరాజ్యసమితిలో భారతదేశం తటస్థ వైఖరి కొనసాగించింది. కాని ఇప్పుడు గాజా యుద్ధాన్ని వెంటనే ఆపాలన్న తీర్మానాన్ని బలపరుస్తూ పాలస్తీనాకు అనుకూల వైఖరి తీసుకోవలసి వచ్చింది. దీనికి ముఖ్యకారణం గాజాలో ఇస్రాయీల్ కొనసాగిస్తున్న అమానుష, క్రూరమైన దాడులే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు తాము ఇస్రాయీల్‌కు మద్దతిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆయన కూడా చాలా ఇబ్బందికరమైన పరిస్థితుల్లోనే ఉన్నాడు. అమెరికాలో ప్రజల్లోనే కాదు, డెమొక్రటిక్ పార్టీలోను, అధికారుల్లోను కూడా అమెరికా అధ్యక్షుడి వైఖరి పట్ల వ్యతిరేకత ఉందన్న వార్తలు వస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో అమెరికా గాజా తీర్మానాన్ని వీటో చేసిన తర్వాత భారతదేశం కూడా మరోసారి తటస్థ వైఖరి తీసుకుంటుందని పలువురు భావించారు. కాని అలా జరగలేదు. నిజానికి పాలక బీజేపీకి ఇస్రాయీల్ పట్ల ఉన్న అభిమానం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ఇస్రాయీల్ కు వ్యతిరేకంగా ఉన్న తీర్మానాన్ని బలపరచడం మారిన వైఖరికి నిదర్శనం.

గాజా విషయంలో ఇప్పుడు ఇస్రాయీల్, అమెరికాలు ఒంటరైపోయాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రారంభించిన రష్యా ఎలా ఐక్యరాజ్య సమితిలో ఒంటరైపోయిందో అదేవిధంగా ఇప్పుడు ఇస్రాయీల్, అమెరికాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడిలోను అసహనం పెరుగుతోంది. ఇస్రాయీల్ ప్రభుత్వంలో ఉన్న మతతత్వవాదులను తొలగించాలని కూడా ఆయన ఒక సందర్భంలో చెప్పాడు. ఈ యుద్ధం తర్వాత ఇస్రాయీల్ గాజాలో తన సైన్యాన్ని కొనసాగించాలని అనుకుంటుంది. గాజాను అదుపులో ఉంచుకోవాలని భావిస్తోంది. కాని అమెరికా ఈ యుద్ధం తర్వాత రెండుదేశాల పరిష్కారాన్ని బలంగా ముందుకు తీసుకురావాలని భావిస్తోంది. వచ్చే సంవత్సరం అమెరికాలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇస్రాయీల్ కు బిడెన్ ఇస్తున్న మద్దతు అమెరికా ఎన్నికల్లో బెడిసికొట్టే ప్రమాదాలు కూడా ఉన్నాయి. ఇస్రాయీల్ పూర్తిగా అమెరికా సరఫరా చేసే ఆయుధాలపై ఇప్పుడు ఆధారపడుతోంది. మందు గుండు సరఫరా అమెరికా నిరంతరం కొనసాగిస్తుందన్న హామీ కూడా లేదు. ఏది ఏమైనా గాజాలో ఇస్రాయీల్ కు మద్దతివ్వడం పెద్ద తప్పిదంగా ఈ దేశాలు భావించే పరిస్థితులు వస్తున్నాయి.

మరోవైపు గాజా యుద్ధంలో అడుగుపెట్టిన హూతీలు కొత్త సవాళ్ళను విసురుతున్నారు. ఇప్పటి వరకు గాజా యుద్ధం విస్తరించలేదు. వెస్ట్ బ్యాంకులో కూడా ఇస్రాయీల్ దుందుడుకు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ వెస్ట్ బ్యాంకులో పూర్తి స్థాయి యుద్ధంగా మారలేదు. ఇరుగు పొరుగున ఉన్న లెబనాన్, సిరియా, జోర్డన్, ఈజిప్టు దేశాలు పాలస్తీనాకు ఇస్తున్న మద్దతు ఇంతవరకు కేవలం మాటలకే పరిమితం. లెబనాన్ లో హిజ్బుల్లా అడపాదడపా దాడులు చేస్తూ ఇస్రాయీల్ సైన్యానికి తన బలం ఎంత ఉందో చెబుతున్నప్పటికీ పూర్తి స్థాయి యుద్ధంలో దిగలేదు. ఒకవిధంగా చెప్పాలంటే హిజ్బుల్లా కూడా సహనంతో వ్యవహరిస్తోంది. సిరియాలోని అనేక సాయుధ గ్రూపులు కూడా చాలా వరకు యుద్ధాన్ని విస్తరించకుండా సహనం వహిస్తున్నాయనే చెప్పాలి. జోర్డన్, ఈజిప్టులు యుద్ధానికి దూరంగానే ఉన్నాయి. ఈ దేశాలు యుద్ధంలోకి వస్తే ప్రాంతీయంగా యుద్ధం విస్తరించే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలో ప్రయోజనాలున్న సౌదీ అరేబియా, టర్కీ, ఈరాన్ దేశాలు కూడా పాలస్తీనాకు మాట సహాయమే చేస్తున్నాయి. అంతకు మించి ఏమీ చేయడం లేదు. అమెరికా, యూరపు దేశాల నుంచి ఇస్రాయీల్ కు సహాయం

లభిస్తున్నప్పటికీ ఈ దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలో లేవు.

ఆర్థికంగా కూడా గాజాలో యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావమేమీ లేదు. అమెరికా, ఇస్రాయీల్ దేశాలకు రక్షణ ఖర్చులు పెరగడం తప్ప మిగిలిన దేశాలపై పడే ప్రభావం ఏదీ లేదు. కాని, ఈ యుద్ధంలో అడుగుపెట్టి తమ బలమేమిటో చూపిస్తున్న హూతీలు ఈ సమతుల్యాన్ని, ప్రపంచదేశాల నిష్క్రియాపరత్వాన్ని సవాలు విసిరే అవకాశాలున్నాయి. ఆ పరిస్థితిలో యుద్ధం విస్తరించడం తప్పదు. ఎమన్ కు చెందిన హూతీ తిరుగుబాటు దళాలు హిందూమహాసముద్రానికి, ఎర్ర సముద్రానికి మధ్య ఉన్న బాబల్ మందేబ్ సముద్రమార్గాన్ని దాదాపు నియంత్రిస్తున్నారు. ఇది ఇరుకైన నౌకామార్గం. హర్మూజ్, మలక్కా జలసంధుల తర్వాత ప్రపంచంలో అతిపెద్ద మూడవ జలసంధి ఇది. ప్రతిరోజు ఇక్కడి నుంచి అరవై లక్షల బారెళ్ళ చమురు రవాణా జరుగుతుంది. ఈ చమురు ముఖ్యంగా యూరప్ దేశాలకు వెళుతుంది. గాజా యుద్ధంలో పాలస్తీనా పక్షాన దిగిన హూతీలు ఎర్రసముద్రంలో నౌకామార్గాలపై పంజా విసురుతున్నారు. దీనివల్ల చమురు ధరలు పెరుగుతాయి. చమురు ధరలు మాత్రమే కాదు చాలా ధరలు పెరుగుతాయి.

హూతీల దాడులను అదుపు చేయడం సాధ్యమా? దౌత్యపరంగా హూతీలతో చర్చలు జరిపే ప్రసక్తి రాదు. ఎందుకంటే వారిని ఎవరు గుర్తించడం లేదు. ఒక్క ఈరాన్ మాత్రమే మాట్లాడగలదు. ఈరాన్ కూడా సూత్రబద్ధంగా హూతీలను బలపరుస్తుంది కాని వారిని అదుపు చేయడం ఈరాన్‌కూ సాధ్యం కాకపోవచ్చు. ఈరాన్ చెప్పినా వాళ్ళు వినకపోవచ్చు. ఆర్థిక ఆంక్షలను విధించి హూతీల మెడలు వంచే అవకాశాలు కూడా లేవు. ఎమన్ పై అనేక ఆంక్షలు విధించినా హూతీలు ఎన్నడూ పట్టించుకోలేదు. సముద్రంపై సరుకుల నౌకలను మాత్రమే కాదు సాయుధ నౌకలపై కూడా దాడులు చేసిన చరిత్ర హూతీలకు ఉంది. ఎర్రసముద్రంలో నౌకలకు హూతీల బెడద ఎప్పుడూ ఉంది. జనవరి 2017లో రిమోట్ బోటులతో సౌదీ నౌకపై దాడి చేయడమే కాదు సౌదీ నౌకాదళం ఎమన్ జలాల నుంచి వెనక్కు తగ్గేలా చేశారు. జులై 2018లో సౌదీ ఆయిల్ ట్యాంకర్లను క్షిపణులతో ధ్వంసం చేశారు. 2021లో ఎమన్ తీరంలో ఈరాన్, ఇస్రాయీల్ మధ్య అప్రకటిత జలయుద్ధం జరిగింది. గాజా యుద్ధం నేపథ్యంలో కూడా హూతీలు పాలస్తీనాకు మద్దతుగా ఒక నౌకను అపహరించారు. ఆ తర్వాత అమెరికా హూతీలను ఉగ్రవాదులుగా ప్రకటించాలనే విషయం ఆలోచిస్తోంది. ఈ విషయమై అమెరికా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా హూతీ, హిజ్బుల్లా వంటి సంస్థలు మరింత రెచ్చిపోయే అవకాశాలున్నాయి. అందువల్లనే అమెరికా, పాశ్చాత్య దేశాలు ఆచితూచి అడుగేస్తున్నాయి.

ఎర్రసముద్రంలో హూతీలను ఎదిరించడానికి ఇప్పుడు అమెరికా, ఫ్రాన్స్, యుఏయి, ఇస్రాయీల్ తదితర దేశాలు ఒక్కటవుతున్నాయి. తమకు వ్యతిరేకంగా ఒక్కటవుతున్న దేశాల గురించి హూతీలకు తెలుసు. సౌదీ, యుఏయి దేశాలు ఈ కూటమిలో చేరకుండా ఇప్పటికే హూతీలు హెచ్చరికలు జారీచేశారు. ఈ హెచ్చరికలను ఈ దేశాలు పెడచెవిన పెట్టలేవు. ఎందుకంటే ఈ దేశాల చమురు రిగ్గులపై హూతీ దాడులను ఆపడం అంత తేలిక కాదు. ఈ చమురు క్షేత్రాలపై దాడులు జరిగితే యుద్ధం మరింత విస్తరిస్తుంది. ప్రపంచంలో చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి.

అత్యంత అమానుషంగా వేలాది ప్రాణాలు బలైపోతున్న గాజాయుద్ధంపై నిజానికి ప్రపంచదేశాలు ఇప్పుడు ఆలోచిస్తున్నది తక్కువ. కాని హూతీలు రెచ్చిపోతే అదుపుచేయడం ఎలా అని ఆలోచిస్తున్నది ఎక్కువ. మానవప్రాణాల కన్నా చమురుకే ఎక్కువ విలువ ఉందనిపిస్తోంది. ■

## నమ్మినా నమ్మకపోయినా? 14

### ఊహించని ప్రయోజనాలు

ఎలాంటి సంకుచితత్వం, దురభిమానాలు, భేదభావాలు లేకుండా విశాల హృదయంతో ఒక విషయాన్ని లేదా సమస్యను పరిష్కారం దిశగా ఆలోచిస్తే మనకు మన జీవితంలో ఊహించని లాభాలు, ప్రయోజనాలు చేకూరుతాయి. బాంధవ్యాలు పటిష్టమవుతాయి.

### పిడివాదం

ఎటువంటి సహేతుకమైన ఆలోచన లేకుండా, సంకుచిత మనస్సుతో, దురభిమానంతో, వక్ర బుద్ధితో ఒక సమస్య లేక విషయంపై పిడివాదం చేసినట్లయితే జీవితంలో మనకు ఎలాంటి ప్రయోజనం చేకూరకపోగా, ఉన్న సంబంధ బాంధవ్యాలు కూడా తెగిపోయి ఎన్నో నష్టాలను, కష్టాలను కలుగజేస్తాయి.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

అధ్యాయం -4

10

# నిర్ధారణాగ్రేసరుడు

# మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## 1. ఈరానీయులకు సందేశం! సహోదరులయ్యే అవకాశం

సముదాయం నాయకులు మహనీయ అబూబక్ర్ సిద్దీక్ (ర)కు, తిరుగుబాటు దారుల అణచివేత పట్ల కాస్త తీరుబాటు ప్రాప్తమవగానే తన సేనాధిపతి, మహనీయ ఖాలిద్ బిన్ వలీద్‌ని, ఆ కాలపు రెండు అగ్ర రాజ్యాలలో ఒకటి పర్షియా చక్రవర్తిని సంబోధించి ఇస్లామ్ సందేశాన్ని అందజేయవలసిందని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశం ఆయనకు యమామలో దొరికింది. వెంటనే ఆయన సందేశం ఈరాన్ గవర్నర్ హుర్ముజ్‌కు పంపారు. అందులో అందజేసిన సందేశం ముక్తసరిగా,

> **"మీరు దైవధర్మం స్వీకరించి మా సహోదరులూ కాగలరు, లేదా ఇస్లామీయ రాజ్యానికి విధేయులయి కప్పం కట్టి మీ ధన ప్రాణాలకు మా రక్షణ పొందగలరు. మరో మార్గం లేదు, మార్కొనడం తప్ప! దీన్ని కాదన్నారంటే, మమ్మల్ని నిందించి ప్రయోజనం లేదు, బాగా గుర్తుంచుకోండి, నా వెంట ఉన్న జనం ఈ విషయంలో మృత్యువునే కోరు కుంటారు, మీరు జీవితాన్ని కోరుకున్నంతగా!"**

ఈ మధ్యన రాజధాని నుండి సందేశం అందగానే హుర్ముజ్, హుజైర్ అనే చోట లక్ష మంది సైనికులతో బిడారు వేసి కాచుకు కూర్చున్నాడని తెలిసింది. మహనీయ ఖాలిద్, హుర్ముజ్‌ని కేక వేసి పిలిచారు. అతను వెంటనే మార్కొనేందుకు సిద్ధమయ్యాడు. కాని కొన్ని క్షణాల్లోనే హతమయ్యాడు. ఆ తరువాత ఈరానీయులు నిలువ లేకపోయారు, కాళ్లకు బుద్ధి చెప్పారు.

అగ్ర రాజ్యం పైన ఈ విజయ సమాచారం విని సిద్దీక్ అక్బర్(ర) దైవానికి కృతజ్ఞతా ప్రణామాల నమాజ్ అర్పించుకున్నారు. హుర్ముజ్‌కు చెందిన కిరీటం, ఆనాటి ఒక లక్ష రూపాయల ఖరీదు చేసేది, మహనీయ ఖాలిద్‌కు బహూకరించారు. ఇస్లామీయ ధనాగారానికి అంతులేని సంపద ప్రాప్తమయింది. హుజైర్ ఉదంతం తరువాత మహనీయ ఖాలిద్ వరుసగా నాలుగు సైనిక చర్యల్లో పాల్గొని విజయవంతంగా తిరిగి వచ్చారు.

## మరికొన్ని సైనిక చర్యలు

కొన్ని ప్రాంతాల్లోని జనం, తమ గృహాలూ దుర్గాలను, తమ భూములూ జాగీరులనూ, సర్వాన్నీ వశపరచుకుని తమకు సురక్షితంగా అక్కడి నుండి వెళ్ళే అనుమతి నివ్వాలని ఇస్లామీయ ప్రభుత్వాన్ని అర్థించారు. మహనీయ ఖాలిద్ ఆ అర్థింపును అంగీకరించారు. అలా ఎంతో ప్రాణ నష్టం తప్పి పోయింది. మిగతావారు, దగ్గరి చిన్నపాటి నవాబులు, జమీందారులు కప్పం కట్టి జీవించడానికి సమ్మతించి ఒప్పందాలు చేసు కున్నారు. ఆ ప్రాంతం నుండి బయలుదేరి మహనీయ ఖాలిద్

ముందుకు సాగగా పెద్ద సేనాని, మహ్రాన్ ఎదురయ్యాడు. అతనికి తోడుగా అనేక మంది క్రైస్తవ సిపాయీలూ ఉకబా నాయకత్వాన వచ్చి కలిశారు.

క్రైస్తవ సేనాని ఉకబా, ఖాలిద్ వస్తున్నారని వినగానే మహ్రాన్‌ని సంబోధించి, మేము అరబ్బులం, అరబ్బుల యుద్ధ విధానం మాకు బాగా తెలుసు. నీవు ఆగు, మేము అతన్ని మార్కొంటాము అని చెప్పి ముందుకు వెళ్ళాడు. ఖాలిద్ ఆనవాయితీ ప్రకారం ఎదుటి సేనానిని కేకవేసి పిలిచారు. అతను ముందుకు రాగానే " జాగ్రత్త!" అంటూ రంగంలోకి దుమికారు మహనీయ ఖాలిద్. అంతే, అతను భయంతో గజగజ వణకసాగాడు! కరవాలం అతని చేజారి పోయింది. ఖాలిద్ కరవాలం అతనికి అందజేయ బోతే అతను భయం వల్ల వణుకుతున్న కారణాన పట్టుకోలేక పోయాడు.

కడకు ఆయన అతన్ని ఓ ముస్లిమ్ యోధునికి అప్పజెప్పారు. ఇది గమనించిన క్రైస్తవ, అరబ్బుల సేనికులు రణరంగాన్ని వదలి కాళ్ళకు బుద్ధి చెప్పారు. వారు పరారయి తమ కేంద్రానికి చేరుకున్నారు. వారక్కడ ముస్లిమ్ యోధుల సమక్షాన ఈరానీ యుల కుమ్మక్కుదారులు ఎలా పలాయనమయ్యారో, ఆ గాథను వినిపించారు. ఇక వారున్నూ కోట వదలి పారిపోయారు. ఉకబా ఆ విధంగా అంతమయ్యాడు.

అక్కడి నుంచి కోటలోకి ప్రవేశించి చూసినప్పుడు అక్కడ బైబిల్ పాఠాలు గ్రహిస్తున్న నలభై మంది విద్యార్థులు అగుపడ్డారు. వారిలో ఆ తరువాత పెద్ద వారయి స్పెయిన్‌ని జయించిన తారిక్ బిన్ జియాద్‌కు తోడ్పాటు నిచ్చిన వారిలో ఒకరయిన మూసా తండ్రి నసీర్, మహనీయ ఉస్మాన్ స్వేచ్ఛ నిచ్చిన మహ్రాన్ కూడా ఉన్నారు. ఈ విద్యార్థుల్ని ఇస్లామీయ సేనలో పంచి పెట్టడం జరిగింది.

ఆ తరువాత దూమతుల్ జన్దల్ వైపునకు బయల్దేరారు. అక్కడ బహుదైవారాధకులు, క్రైస్తవులూ కలసి ఒక ముస్లిమ్ జనరల్‌తో పోరాడుతున్నారు. ముస్లిములు చాలా తక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ విషయం తెలియగానే మహనీయ ఖాలిద్ వారి సహాయార్థం అక్కడికి చేరుకున్నారు. ఆ ఉద్యమాన్ని జయించి క్రమేణా ఈరానీయులు ముస్లిములను ఛాలెంజ్ చేసిన ప్రతి సందర్భాన్ని పురస్కరించుకుని ఇస్లామీయ సైనికుల బలాధిక్యతను రూఢీ పరుస్తూ ముందుకు సాగారు ఖాలిద్ బిన్ వలీద్!

హిజ్రీ 12వ సంవత్సరం జీకఅద నెలలో రోమనులు, ఈరానీ యులు, అరబ్బులు కలిసి ముస్లిములపైన దాడికి సన్నాహాలు చేయసాగారు. యుద్ధ నిపుణుడు జనరల్ హుజైల్‌ని ఈ కూటమికి సేనాధిపతిగా నియమించుకున్నారు. ఈ సమాచార మంతా ఖాలిద్ బిన్ వలీద్‌కు తెలియగానే ఆయన ఇద్దరు ముస్లిమ్ సేనా నాయకులు, కా'కా', అబూ యాలాను వెంట బెట్టుకుని శత్రు సేనకు ఎదురుగా తన సేనల్ని వరుసలు తీర్చి నిలబెట్టారు.

జీకఅద 15వ తేదీన ఉదయాన్నే శత్రుసేన పైన మూడు దిశల నుంచి ఒకేసారి దాడి జరిపారు. అంతే, శత్రువు బిత్తరపోయాడు, చిత్తు చిత్తుగా ఓడిపోయాడు. వేలకొద్ది సైనికుల్ని బందీలుగా తీసుకుని, అంతులేని సామగ్రి యుద్ధ ప్రాప్తిగా ప్రోగు చేసు కోవడం జరిగింది. ఇది ఇలా ఉండగా మహనీయ ఖాలిద్‌కు ఖలీఫా ఆదేశాలు లభించాయి, అక్కడ 'ముసన్నా'ను నాయకు నిగా వదలి వెంటనే సిరియా వెళ్ళ వలసిందని, అక్కడ 'యర్మూక్' నది మలుపు తిరిగిన చోట ఇస్లామీయ సేనకు అవసరమయిన సహాయం అందజేయవలసిందనీను.

## 2. మరో అగ్రరాజ్యంతో

ఆ కాలంలో ఈరాన్ తరువాత మరో అగ్ర రాజ్యం రోమన్ సామ్రాజ్యం. అరేబియా ఉత్తరాన సిరియా పైన రోమను గవర్నర్ హెరాక్లియస్ పాలన సాగుతోంది. అక్కడి జనులూ పాలకులూ ఇరువురూ క్రైస్తవులే. అరేబియా సిరియా సరిహద్దులలో ఉండే అరబ్బుల్ని సిరియన్ ప్రభుత్వం, క్రైస్తవులుగా మార్చివేసి వారికి చిన్న చిన్న రాజ్యాలు ఇచ్చి తమ ప్రభుత్వాన్ని పటిష్ట పరచుకుంది. రోమనుల ప్రమాదం ఎప్పటికయినా ఉంటుందనీ, సరిహద్దులు సురక్షితంగా లేవనీ తలచి మహనీయ అబూ బక్ర్, హిజ్రీ 15వ సంవత్సరం చివరన సహచర మాన్యుల సలహాతో, నలుగురు నిపుణులయిన సేనా నాయకుల్ని ఎన్నుకుని 'హుమ్స్','పాలస్తీనా', 'డెమాస్కస్' , 'జోర్డాన్' కు, మొత్తం 27 వేల సైన్యాన్ని తోడిచ్చి పంపారు.

అదే సమయాన హెరాక్లియస్ తన పక్షాన నలుగురు సేనానుల్నీ మూడు లక్షల సైన్యాన్నీ నిలిపాడు.

శత్రు సేనల ఆధిక్యత కారణంగా ముస్లిమ్ సేనానులు ఒకే చోట మోహరింపు చేసిపోరాడాలని నిర్ణయించుకున్నారు. మరోవైపున ఓ దూతను ఖలీఫా వద్దకు ఈ ఏర్పాటును

అనుమతించేందుకు పరుగెత్తించారు. ఇంకా మరింత మద్దత్తు కావాలని కూడా కోరారు. ఖలీఫా అనుమతి నిస్తూ మద్దత్తు త్వరలోనే అందుతుందని హామీ నిచ్చారు.

రోమను సిరియను సేనలు యర్మూక్ నదీ మలుపు తిరిగిన డెల్టాలోని మైదానంలో నిలిచిపోయాయి. అక్కడే పర్వతానికీ నదికీ మధ్య ఉన్న లోయలో ఇస్లామీయ సేనలూ మోహరించాయి. రోమను సిరియను సేనలు వచ్చే దారి అదొక్కటే! దానికి ఎదురుగా పర్వత శ్రేణి ఒకటి మిగిలింది. ఆ సందర్భంలోనే మహనీయ ఖాలిద్ పదివేల బలగంతో వచ్చి ముస్లిములతో చేరారు. ఆయన విచారించారు. సిపాయీలు అందరూ ఒకేచోట చేరి ఉన్నప్పటికీ పోరు జరిగేటప్పుడు వారు తమ తమ నాయకుల ఆధ్వర్యంలోనే పోరాడతారని తెలిసింది.

## రణ తంత్రం

ఖాలిద్ అక్కడికి చేరగానే నలుగురు కమాండర్లను పిలిపించి తన పథకాన్ని ఇలా వివరించారు :

"నేటి ఈ మార్కోలు జీవన మృత్యువుల వ్యవహారం అని చెప్ప వచ్చు. దీని ద్వారా మన భవిష్యత్తు సమృద్ధమూ కావచ్చు దుర్గతి పాలవనూ వచ్చు. అందువల్ల మనం కేవలం దైవ ప్రసన్నత కొరకు మాత్రమే ప్రయత్నం చేయవలసి ఉంటుంది. శత్రువు బహు భారీ సంఖ్యలో ఉన్న విషయం చూస్తూనే ఉన్నాము, మన పైన బలోపేతంగా దాడి చేయదలచిన విషయమూ మనకు తెలుసు. నా అభిప్రాయంలో మనమందరం పరస్పర సలహా సంప్రతింపుల ద్వారా ఓ సముచితమయిన పథక రచన చేసు కోవాలి."

### గీటురాయి వారపత్రిక — ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

అప్పుడు కమాండర్లు "మీ దృష్టిలో ఏదయినా సూచన ఉంటే చెప్పండి" అన్నారు.

దానికి, ఖాలిద్ ఇలా అన్నారు:

"నా అభిప్రాయంలో మనమంతా వేర్వేరుగా కాక అందరం ఒకే సేనాధిపతి ఆధ్వర్యంలో పోరాడటం ఉత్తమం. దీనివల్ల ఎవరి గొప్పదనంలోనూ ఎటువంటి లోపం రాదు. అలాగే దైవం వద్దనూ ఖలీఫా వద్ద నూ ఎటువంటి అంతస్థు తరగదు. నేడు మనం మన శక్తినంతా ప్రయోగించి రోమనులను మట్టి కరిపించినట్లయితే, ఇన్‌షా అల్లాహ్, ఇక ముందు కూడా ఆధిక్యత పొందగలము. అలా కాక, దైవం మన్నించుగాక, వారు మనల్ని తరిమి కొట్టినట్లయితే, ఇక ఎప్పటికీ లొంగడమే మనకు గతి అవుతుంది. అటువంటప్పుడు ఖలీఫాకు ఎంత బాధ కలుగుతుంది?? అందువల్ల మనమంతా వంతులవారీగా నాయకత్వం చేపడదాం, ఒకరు ఈ వేళ, మరొకరు రేపు, ఇంకొకరు మరునాడు, అలా ముగిద్దాము. అయితే అందరూ సమ్మతిస్తే నేడు ఆ బాధ్యత నాకు అప్పజెప్పండి" అని ముగించారు.

నలుగురు నాయకులూ ఈ సలహాను ఆమోదించారు. ఖాలిద్ ఓ సేనానిగా తన సేనల్ని ఎంతో చాకచక్యంగా బారులు తీర్చారు. అది అసాధారణ వ్యూహం అంటారు చరిత్ర కారులు. అబూ సుఫ్యాన్ అమీర్ ముఆవియ(ర) తండ్రి)ని పిలుపు నిచ్చే వానిగాను, అబూదర్దా (ర)ని న్యాయాధికారిగాను, మిక్దాద్ (ర)ని పారాయణ కర్తగాను నియమించారు.

ఇస్లామీయ సైన్యం విధానం ఏమిటంటే యుద్ధానికి ముందు పారాయణకర్త కుర్ఆన్ వచనాలు వినిపించిన తరువాత పిలుపు నిచ్చేవారు. సిపాయీలను ఉత్తేజ పరిచే ప్రసంగం చేస్తారు. మహనీయ ఖాలిద్ ఒక్కొక్క బెటాలియన్ వద్దకు వెళ్లి సిపాయీలను ఉత్తేజిత పరిచారు. ఒక బెటాలియన్‌లో ఓ శబ్దం విన వచ్చింది, "మన సంఖ్య తక్కువగా ఉంది, రోమనులు అధికంగా ఉన్నారు." దానికి ఖాలిద్,

"నిజానికి మనమే ఉన్నాము, ఇక్కడ మరెవరూ లేరు. మనం తప్ప ఉన్నవారంతా తమ పిరికితనం వల్ల మన పేరును సమున్నతం చెయ్యడానికి వచ్చిన వారు. మన కరవాలాల పదునులో సత్యం మెరుస్తోందన్న విషయం మరువకండి!" అన్నారు.

ఇరువైపులా బారులు తీరిన సైనికుల్ని చూసి ఖాలిద్, కుడి

ఎడమల సేనా నాయకులతో దైవం పేరు పలికి, బాణ పరంపర ప్రారంభించ వలసిందని, కాస్సేపు తరువాత ధీటుగా దాడి జరప వలసిందని కోరారు. తాను స్వయంగా తెల్ల గుర్రాన్ని ఎక్కి శత్రు సేనల్ని చీల్చుకుంటూ లోనికి చొరబడ్డారు. మిగతా సేనా నాయకులు కూడా ఆయన్ని, అదే ధాటితో, అనుసరించారు. అదే సమయాన ఇక్రిమా(ర), "దైవ మార్గంలో అమరగతి పొందగోరే వారు, నన్ను వెంటాడి రండి!" అని కేక వేశారు. అందరూ కలిసి శత్రుసేన పైన ధీటుగా దాడి చేశారు!

"దైవమే గొప్ప వాడు (అల్లాహు అక్బర్)" అన్న నినాదంతో మూడు వందల ముస్లిమ్ సిపాయీలు, మూడు లక్షల మంది శత్రు సిపాయీల్లోకి తమ భవిష్యత్తును లక్ష్య పెట్టక దుమికారు. వారు ఎటు వెడితే అటునుంచి రోమను సేన దూది పింజాల్లా ఎగిరిపోసాగింది. రోమనుల ఓ కమాండర్, ముస్లిముల ఈ ప్రాణ త్యాగ కాంక్ష పట్ల ప్రభావితుడయి, మధ్యాహ్నం వేళకు ముస్లిమయిపోయాడు! ఆ పైన కొందరు సిపాయీలతో పాటు కలసి వచ్చి ముస్లిముల పక్షాన పోరాడసాగాడు.

ఒక దినం పూర్తిగాను మరో రాత్రి దాదాపు పూర్తిగాను ఈ సమరం కొనసాగింది. దైవ దాసులు, ముస్లిములు పగలంతా నాలుగు పూటల నమాజ్ సంకేత ప్రాయంగానే పూర్తి చేయగలిగారు. వాస్తవానికి శత్రువులు సగం రాత్రికి ముందే మైదానం వీడి పారిపోవడం మొదలెట్టారు. మహనీయ ఖాలిద్, పారిపోతున్న వారికి, అనవసరంగా రక్తపాతం కూడదన్న దృష్టితో, దారి వదలి పెట్టారు. అనేక మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. కడకు తెల్లవారిపోతుండగా మహనీయ ఖాలిద్ రోమను సేనాధిపతి గుడారంలో కూర్చొని ఉన్నారు!

ముస్లిములు తమ అమర గతులయిన వారిని ఒక్కొక్కరినే ఓ చోట చేర్చుతున్నారు. మహనీయ ఖాలిద్ దృష్టి రెండు అమరగతి పొందిన వారి దేహాల పైన పడింది, ఇక్రిమా, ఆయన తనయుడు నవ యువకుడు అమ్ర్. ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. "సత్య మార్గ షహీదులారా! నా కన్నా మీరే ముందుగా అమరగతి ఆకాంక్షను సాధించారు! మహనీయ అమ్ర్ బిన్ ఆస్ చూడగానే, "ఇటువంటి ఉన్నత స్థానానికి తన జీవితాన్ని ధార పోయడానికి సిద్ధం కాని ముస్లిమ్ ఎవరయినా ఉంటాడా?" అన్నారు. ఈ పోరులో మహిళలు సయితమూ పాల్గొని అమరగతిని సాధించారు.

రోమనుల కొరకు ఈ యుద్ధం దైవాగ్రహం కన్నా, అభిశాపం కన్నా ఏమాత్రం భిన్నమయింది కాదు. హెరాక్లియస్‌కు ఈ నాశన వృత్తాంతం చేరగానే అతనికి స్పృహ కోల్పోయినంత పనయింది. అక్కడి నుంచి అతను హుమ్స్ వెళ్ళిపోయి నిజానిజాల విచారణ జరపడానికి ఒక విషయ నిపుణుడిని పంపించాడు. అతను వచ్చి ఇలా తన రిపోర్టు సమర్పించాడు:

"వారు నిస్సందేహంగా రాత్రిళ్ళు దైవదూతలయి, పగటి పూట ఆగ్రహ మహా కాయులయి మెలుగుతారు. వారి దృష్టిలో న్యాయం అంటే, వారి యువరాజయినా దొంగతనం చేస్తే అతని చేతులూ నరకుతారు. వారివద్ద అధికారాల్లో ఒకరు పెద్ద మరొకరు చిన్న అన్న ప్రసక్తే ఉండదు." ✤


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




డిసెంబర్ 8, 2023వ తేదీన కేరళలో అశోకన్ తన కుమార్తె కనబడడం లేదని కేరళ హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. త్వరలో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. అశోకన్ దేశంలో మరోసారి లవ్ జిహాద్ చర్చను ప్రారంభించాడు. అశోకన్ ఆరోపణల్లో మతపరమైన కోణాలున్నాయి, ఇది ముస్లిం వ్యతిరేక భావాలను, బిజెపికి అనుకూలంగా ఓట్ల ధృవీకరణకు ఉద్దేశించిన చర్యగా కనిపిస్తోంది. ఎందుకంటే ఈ అశోకన్ మరెవరో కాదు, లవ్ జిహాద్ గగ్గోలుకు కారణమైన "హాదియా కేసు"లో హాదియా తండ్రి ఈయన. అశోకన్ సాధారణ ఎన్నికలు వస్తున్నప్పుడు తన కేసు వేశాడు. దేశంలో లవ్ జిహాద్ చర్చ, హిందూ ముస్లిం రాజకీయాలను రెచ్చగొట్టి, విభజన రాజకీయాలు నడిపేవారికి కావలసినంత అవకాశం కల్పించాడు.

2014 నుండి, 'లవ్ జిహాద్' ప్రచారం జరుగుతోంది. కాని లవ్ జిహాద్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు ఎవ్వరు ఎక్కడా చూపించ లేదు. ఈ ప్రచారంతో ముస్లిం పురుషులపై బురద జల్లుతున్నారు. ఈ ఆరోపణలు నిరాధారమైనవని ప్రభుత్వ విచారణ సంస్థలు, న్యాయస్థానాలు కూడా పలుమార్లు స్పష్టం చేశాయి. కాని అబద్ధాన్ని నిజంగా భ్రమింపజేసే గోబెల్స్ ప్రచారం వల్ల దీన్ని చాలా మంది నమ్మే పరిస్థితి దాపురించింది. ఫలితంగా ముస్లిం పురుషులకు వేధింపులు, సామాజిక బహిష్కరణ, చట్టపరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితి దేశంలో నెలకొన్న మతతత్వ వాతావరణాన్ని ప్రతిఫలిస్తోంది. సామాజిక సామరస్యాన్ని ప్రభావితం చేస్తోంది. సమాజంలో అపనమ్మకాలు, భయ సందేహాలను పెంచుతోంది.

హాదియా అనే అమ్మాయి ఇస్లాం స్వీకరించింది, ఆ తర్వాత ఆమె ఒక ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఆ దంపతులకు వేధింపులు మొదలయ్యాయి. ఒక సుదీర్ఘ న్యాయ పోరాటం చేయవలసి వచ్చింది. ఆమె తండ్రి పెట్టిన కేసు వల్ల ఆమెను 'లవ్ జిహాద్' బాధితురాలిగా పేర్కొంటూ కేరళ హైకోర్టు 2017లో ఆమె వివాహాన్ని రద్దు చేసింది. అయితే, హదియా వెనక్కి తగ్గలేదు. తాను స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఈ పెళ్ళి చేసుకున్నానని చెప్పింది. ఈ కేసు చివరకు సుప్రీంకోర్టుకు వెళ్ళింది, సుప్రీంకోర్టు ఎన్ఐఏ దర్యాప్తు చేయాలని ఆదేశించింది. 2018లో సుప్రీంకోర్టు ఆమె వివాహాన్ని చట్టబద్ధమేనని ప్రకటించింది, ఆమెకు తన మత విశ్వాసాన్ని ఎంచుకునే హక్కు ఉందని, భాగస్వామిని ఎన్నుకునే హక్కు ఉందని ధృవీకరించింది. ఈ కేసు మత స్వేచ్ఛ, మహిళల స్వయంప్రతిపత్తి భారతదేశంలో 'లవ్ జిహాద్' ప్రచారం వంటి సమస్యలను చర్చకు తీసుకు వచ్చింది.

2023 డిసెంబర్ 10న హదియా ఒక వీడియో విడుదల చేసింది. తన తండ్రి చేసిన ఆరోపణలను ఖండించింది. తనను చట్ట విరుద్ధంగా నిర్బంధించి ఉంచారన్న వాదనను ఖండించింది. తాను తన మొదటి భర్త షఫీన్ జహాన్ నుండి విడిపోయానని, వివాహం చేసుకోవడానికి, విడాకులు తీసుకోవడానికి తనకు అన్ని హక్కులు ఉన్నాయని, తన ఇష్టానుసారం మరో వివాహం చేసుకున్నామని ఆమె స్పష్టం చేసింది. తన వ్యక్తిగత జీవితం పట్ల పరులు అనవసరమైన ఆసక్తి చూపడాన్ని వేలెత్తి చూపించింది. సంఘ్ పరివార్ ఒత్తిడి వల్లనే తన తండ్రి ఈ కేసు పెట్టాడని, తన జీవితంలో అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని చెప్పింది. సైబర్ దాడులతో సహా తనకు ఇబ్బందులను సృష్టించడంలో ఆయన ప్రమేయం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కేసులో మొదట ఆమె తండ్రి 'లవ్ జిహాద్' ఆరోపణ చేశాడు. ఆమె మొదటి వివాహాన్ని హైకోర్టు రద్దు చేసింది, 2018లో సుప్రీంకోర్టు ఆమె వివాహాన్ని పునరుద్ధరించింది. నచ్చిన మతాన్ని, నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కు ఆమెకు ఉందని స్పష్టం చేసింది. ఎన్ఐఏ దర్యాప్తులో బలవంతంగా మతమార్పిడి చేసినట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదు. హదియా విడుదల చేసిన వీడియో, ఆమె ఇచ్చిన వివరణలు, తన హక్కుల గురించి నొక్కిచెప్పడం వల్ల మతఉద్రిక్తతలు తలెత్తే పరిస్థితిని ఆమె నివారించారు. ఆమె తండ్రి చేసిన ఆరోపణలు మీడియా ప్రచారాలవల్ల సమాజంలో ఉద్రిక్తపరిస్థితి తలెత్తకుండా ఆమె ముందుకు వచ్చి తన హక్కుల గురించి నొక్కి చెప్పింది. ఇలాంటి ఆరోపణలను ఎదుర్కొంటున్న చాలా మందికి ఆమె వైఖరి ఇప్పుడు ఒక ఉదాహరణగా మారింది. ఆశాజనకంగా పనిచేస్తుంది

# పసివాళ్ళ ఏడ్పుపై కూడా ఫేక్ వార్తలొస్తాయి ..

**కేరళ**లో శబరిమల యాత్ర సమయంలో ఒక చిన్న పిల్లవాడు బాధపడుతున్నట్లు చూపించే వీడియో సోషల్ మీడియాలో వచ్చింది. ఈ వీడియోతో మతవిద్వేషం సృష్టించే ప్రయత్నాలు చేశారు. బూమ్ లైవ్ చేసిన నిజనిర్ధారణ తప్పుడు కథనాల బండారం బట్టబయలు చేసింది.

ఈ వీడియోలో జన సమూహంలో ఒక పిల్లవాడు తీవ్రంగా ఏడుస్తున్నట్లు కనిపిస్తుంది. ఆ బాలుడిని కేరళ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వార్త వైరల్ చేశారు. ఆ పిల్లవాడిని తండ్రినుంచి వేరు చేసి నిర్బంధించారని ప్రచారం చేశారు. అక్కడి పోలీసులతో బూమ్ లైవ్ మాట్లాడి అసలు విషయ మేమిటో తెలుసుకుంది.

ఆ పిల్లవాడు గుంపులో తప్పిపోయాడు. అందువల్ల ఏడుస్తు న్నాడని పోలీసులు స్పష్టం చేశారు. పిల్లవాడిని తండ్రితో తిరిగి కలిపినట్లు చెప్పారు. వైరల్ ప్రచారంలో చూపించినట్లు ఆ పిల్లవాడు వీడియోలో పోలీసువ్యాన్లో కూర్చుని లేడు. ఆ పిల్లవాడు కూర్చున్నది రాష్ట్రరవాణా బస్సులో

శబరిమల యాత్ర నిర్వహణకు సంబంధించి కేరళ ప్రభుత్వంపై అనేక విమర్శలు కూడా చాలా మంది చేస్తున్నారన్నది గమనిం చాలి. సరయిన సౌకర్యాలు కల్పించడం లేదని, క్యూ నిర్వహణ చాలా లోపాలతో ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సారి శబరిమల యాత్రకు భక్తుల సంఖ్య పెరగడం వల్ల ప్రభుత్వం దర్శనకాలాన్ని ఒక గంట పొడిగించింది.

మిస్టర్ సిన్హా అనే సోషల్ మీడియా యూజర్ ఒక పోస్ట్ ద్వారా తప్పుదోవ పట్టించే ఈ కథనాన్ని ప్రచారం చేశాడు. కేరళలో హిందువుల పరిస్థితి ఇలా దారుణంగా ఉందంటూ ప్రచారం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేసిన చరిత్ర గతంలో కూడా ఈ సోషల్ మీడియా హ్యాండిల్‌కు ఉంది.

బూమ్ లైవ్ ఒరిజినల్ వీడియోను పరిశీలించింది. ఆ వీడియోలో ఆ పిల్లవాడు తన తండ్రితో తిరిగి కలుసుకుని బస్సులో కూర్చున్నట్లు స్పష్టంగా ఉంది. ఏషియానెట్ న్యూస్ మొత్తం సంఘటన గురించి వివరాలు రాసింది. కేరళలోని నీల్కల్ వద్ద గుంపులో పిల్లవాడు తప్పిపోయాడని, పోలీసులు తిరిగి పిల్లవాడిని తండ్రితో కలిపారని, వైరల్ ప్రచారంలో చెప్పినట్లు పోలీసులు ఆ పిల్లవాడిని నిర్బంధించలేదని స్పష్టంగా తెలియజేసింది. ఒక పిల్లవాడు గుంపులో తప్పిపోయి ఏడుస్తున్న సాధారణ వీడియోను కూడా మతతత్వ శక్తులు ఫేక్ వార్తగా మలిచేశాయి.




సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**ఆయన మీ కోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయా దాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి. (అర్-రూమ్: 21)**

కొంచెం తీపి, కొంచెం చేదు, కొంచెం వగరు, కొంచెం పులుపు, కొంచెం కారం, కొంచెం ఉప్పు....ఈ షడ్రుచుల లాగే- మన జీవితం సకల అనుభూతుల సమ్మేళనం. సంతోషం, దుఃఖం, శాంతం, కోపం, అలక, బుజ్జగింపు, మాట, మౌనం, నవ్వు, ఏడుపులాగే మన జీవితం సకల భావోద్వేగాల సమ్మిశ్రమం... అన్నీ కలగలిస్తేనే జీవితం అందంగా, ఆహ్లాదంగా ఉంటుంది. అయితే అవన్నీ సమపాళ్లలో ఉంటేనే శ్రేయస్కరం, క్షేమమూను. ఇక అన్ని పరిస్థితులలోలను స్థితప్రజ్ఞతను అలవరచుకోవడం మనందరి కర్తవ్యం.

**అలక**

ఒక పనిని సాధించేందుకు కోపం వహించడం. ఈ కోపం తెచ్చుకున్నదే అయి ఉంటుంది. ఆవేశంతో కూడిన కోపం కాదు. చిన్నపిల్లలు తామనుకున్నది సాధించేందుకు, పెద్దవాళ్ళను ఒప్పించేందుకు అలుగుతారు. ఆ విషయానికొస్తే.. అలకకి కారు ఎవరూ అతీతం.

అసలు అలకంటే తెలియని వ్యక్తి ఉంటారా? చెప్పండి! అలక కేవలం ఆడవారి సొంతమా? మగవారిలో అలక ఉండదా? అంటే ఉంటుంది. అయితే తేడా వెలిబుచ్చే రీతుల్లోనే ఉంటుంది. కోపం తెచ్చుకోవటం, రంకెలేయడం, నాలుగు మాటలు అని ఊరుకోవడం మగవాళ్ళు చేసే పనయితే నా మనుసుని నొప్పించిన విషయమిది అని నోరు తెరిచి చెప్పుకోలేక మౌనంగానే తమ మనోగతాన్ని అలక ద్వారా తెలియజేస్తుంటారు ఆడవాళ్లు. అమ్మ అరిచిందని, తాత ఏదో అన్నాడని, అమ్మమ్మ, నాన్నమ్మ తిట్టిందని, పిన్ని కొట్టిందని, మామ మిఠాయి కొనిపెట్టలేదని

పిల్లలు చూపే అలుకలు, కొడుకు పట్టించుకోవడం లేదని, కూతురు కాల్ చేయడం లేదని, కోడలు మర్యాద ఇవ్వడం లేదని, మనవళ్లు మాట్లాడటం లేదని, నవతరంలో వినయం లేదని, తనవారయిన ఎవ్వరూ తమను పట్టించుకోవట్లేదని పెద్దలు చూపే అలకలన్నీ ప్రేమను చాటుకొనే చిరుజల్లులే...! అర్థం చేసుకోవాలే గాని, అనురాగపు సంద్రం అలక. అనుబంధపు సుగంధం అలక. ఇంత చదివాక ఇకపై మనమూ అలక బూనాల్సిందేనని అన్పించక మానదు.

## అనుభవజ్ఞుల మాటల్లో అలక

➢ అలగడం, రాజీ పర్చుకోవడం అనే ఈ చిలిపి కయ్యంలో ప్రేమ ఉప్పొంగుతుంది.

➢ బంధం, అనుబంధం అంటేనే ఒకరు అలగడంలో పర్ఫెక్టుగా ఉంటారు, ఒకరు రాజీ పర్చుకోవడంలో నిష్ణాతులై ఉంటారు.

➢ భార్య అలిగితే మంచి భర్తకు ఇష్టమట. ఎందుకంటే ఆ అలుక నుంచే అతను సాంత్వనం పొందుతాడు.

➢ కోపం ఒకంతటికి తగ్గని మానసిక జాడ్యం. అలుక - కోపం లాంటి చిరు కోపం కాని ఒక చిన్న చిలిపి కయ్యం.

➢ కోపానికి తెలిసిన భాష - అతిక్రమణం. అలుక నేర్చిన భాష- మౌనం.

➢ ప్రతి వస్తువు స్థాయి, నాణ్యతను కొలవడానికి స్కేల్, మీటర్ ఉన్నట్లే. ప్రేమ మీటర్ అలక.

➢ నిజంగా- అలిగే వ్యక్తికీ తనను రాజీ పరుచుకునే వారు ఉంటారు అని ఎంతో నమ్మకం ఉంటుంది. రాజీ పరుచుకునే క్రమంలో కొన్ని గత తీపి జ్ఞాపకాలు చిగుళ్లు పోసుకుంటాయి. ప్రేమలో, అనురాగంతో, అన్యోన్య దాంపత్యం ఈ చిర్రుబుర్రులు, చిలిపి చేష్టలు ఉంటేనే అందం.

➢ జీవన ప్రయాణంలో చాలా తక్కువ వ్యక్తులే తోడు ఉంటారు. వారు గనక అలిగితే వారిని రాజీ పర్చుకోవడాని ఎలాంటి వస్తువునయినా సరే తృణప్రాయంగా త్యాగం చేసేయాలనిపిస్తుంది. సంసారం అన్నాక ఆ మాత్రం సర్దుకుపోవాలి మరి.

## ఆడువారి అలకలకు అర్థాలే వేరులే

అలిగి తొలగి నిలిచినచో చెలిమి జేయ రమ్మనిలె. చొరవ చేసి రమ్మనుచో మరియాదగా పొమ్మనిలె అంటాడు ఓ కవి. అలిగి అలివేణి అలకపాన్పుపై మూడంకె వేస్తే. ఆ భర్తకు ఆమెను మారాం చేయడానికి తల ప్రాణం తోకకొస్తోంది.. తను ఎందుకు అలిగిందో తెలియక జుట్టు పీక్కుంటాడు... అసలు నేనేదైనా చేసినందుకా? నేనెదైనా చెయ్యనందుకా? నేనేదైనా అనినందుకా? నేనేదైనా అననందుకా? నేనేదైనా అనకూడని విధంగా అననందుకా? అన్నందుకా? ఎందుకు?

## అలకకు కారణాలు

మీ భాగస్వామికి మీపై కోపం వచ్చేందుకు సాధారణంగా ఇలాంటి కారణాలు కావొచ్చు. తను ఏదైనా కోరుకుంటే.. అవి మీరు నెరవేర్చకపోతే లేదా మీరు మీ భాగస్వామిపై కోపం చూపించడం వంటివి చేస్తుంటారు. తను మీ నుండి ఏదైనా విలువైనదాన్ని ఆశిస్తుంటే.. మీరు దాన్ని అందించలేకపోతే.. అందుకు గల కారణమేంటో స్పష్టంగా వివరించాలి. దీంతో వారు మిమ్మల్ని కాస్త అర్థం చేసుకుని మీపై అలక మానే అవకాశం ఉంటుంది.

## అడపదడప ఇద్దరు అలిగితనే అందం / అలక తీరి కలిసేదే అందమైన బంధం

వాన వెలిశాక ఎంత హాయిగా ఉంటుందో భాగస్వామి అలక మానాక అంతే హాయిగా ఉంటుంది. భాగస్వామి అలిగినప్పుడే అనుకోని అతిథులు వచ్చారంటే ఇక వారిముందు పడే బాధలు చెప్పలేనివి. అరువు తెచుకున్న చిరునవ్వుని పంచే భార్య మీద భర్త కృతజ్ఞత చూపిస్తే ఆ చిరునవ్వు సొంతమైపోదూ. నా కోసం కాదు, పరువు కోసమే కదా ఆమె అలా నటించింది అనేది అతని మాటయితే అది అగ్నికి ఆజ్యాన్నే చేరుస్తుంది. అతిథిలొచ్చినప్పుడు అలిగిఉన్న దంపతులు వారి ముందు సఖ్యతగా ఉన్నట్లు నటించినప్పటికీ అందులో దాగి ఉన్నది పరస్పర ప్రేమే కదా.

హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా సెలవిచ్చారు: ఒక రోజు అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు, నువ్వు నాతో ఎప్పుడు సంతోషంగా ఉంటావో, ఎప్పుడు చిరు కోపంగా ఉంటావో నాకు తెలుసు. భార్యాభర్తలు సహజంగా ఏదో ఒక విషయంలో చిరు కోపం కలిగి ఉన్నట్టే, నువ్వు ఏదైనా ప్రాపంచిక విషయంలో నాపై కోపంగా ఉన్నప్పుడు అది కూడా నాకు తెలిసిపోతుంది.

నేను అన్నాను, "ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు దీన్ని ఎలా పసిగడతారు? నా మనోగతం తమరికేలా అర్థమైపోతుంది? దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. నువ్వు నాతో సంతోషంగా ఉన్నప్పుడు, "అవును నిజమే, ముహమ్మద్ ప్రభువు సాక్షిగా! అంటావు. అదే నువ్వు చిరుకోపంతో అలకబూని ఉంటే - కాదు కాదు, ఇబ్రాహీం ప్రభువు సాక్షిగా! అంటావు.

హజ్రత్ ఆయిషా (ర) అంటున్నారు, ఇది విన్న తర్వాత నేను "అవును, ఓ అల్లాహ్ ప్రవక్తా!" మీరు చెప్పింది సత్యం, కానీ నేను అలకబూనినప్పుడు మీ పేరును మాత్రమే ప్రస్తావించను అంతే తెలుసా? (అంటే ఆ సమయంలో నా నోటితో మీ పేరును ప్రస్తావించను గానీ, మీరంటే నాకెంతో ఇష్టం తెలుసా? మీ ప్రేమతో నా మది ఎప్పుడు పొంగిపొర్లుతూనే ఉంటుంది) (ముత్తఫఖున్ అలైహి)

## మనసెరిగితే జీవితం మకరందమయం

ప్రవక్తలందరి నాయకులు అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(స) అంతటి మహామహులే అలక తరువాత ఆనందాల గురించి చెప్పారు. కాని మనలాంటి సామాన్య మానవ మాత్రుల్లో మాత్రం అలక చిలికి చిలికి గాలి వానవుతుంది.

ఇప్పుడున్న బిజీలైఫ్‌కి అలకలు, ఊరడింపులు కరువయి పోతున్నాయి. భార్య అలిగిందని భర్త సముదాయించే సమయం గాని, భర్త అలిగాడని భార్య గమనించే పరిస్థితి గాని ఉండడం లేదు. ఎవరి అవసరాలు వారివి, ఎవరి ఆదుర్దా వారిదే. పర్యావసానం ఊహకందనిదే అవుతుంది. ఇక్కడ కావలసింది కేవలం లాలన, పలకరింపు, ఒక చిన్న బహుమతి, ఒకరంటే ఒకరికి ఉన్న ప్రాధాన్యాన్ని తెలుపుకునే ఒక ఉత్తరం, ఒక ఎసెమ్మెస్, ఒక ఇ-మెయిల్ ఇలా మీ కమ్యూనికేషన్‌ని పెంచే అంశం ఏదైనా కావచ్చు. లోలోపల ఒకరి మీద ఒకరికి దాగి ఉన్న ప్రేమను బలపరిచే కారణం అలకే అవుతుందంటే ఆ ఆనందాన్ని అందరూ సొంతం చేసుకోవాల్సిందే.

## ప్రేమగా దగ్గరకు తీసుకుని..

కొన్నిసార్లు మీరు ఒత్తిడిలో ఉన్నప్పుడు.. మీ భాగస్వామిపై కోపం చూపించినట్లయితే.. మీ కోపం కొంత తగ్గాక తనను దగ్గరకు తీసుకుని 'సారీ డార్లింగ్' ఈరోజు నా మనసేం బాగోలేదు. అదే సమయంలో నువ్వొచ్చి మాట్లాడేసరికి నాకు కోపం పెరిగింది. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటాను అని నెమ్మదిగా చెబితే.. ముఖ్యంగా వారిని దగ్గరకు తీసుకుని చెబితే ఇట్టే కరిగి పోతారు. అలిగితివా సఖీ ప్రియా కలత మానవా.... వెలిగించవే చిన్ని వలపు దీపం- ఎందుకే నా మీద ఇంత కోపం' 'గోరొంక కెందుకో కొండంత అలక.. వంటి కవితలతో వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చుకోవచ్చు.

## మంచి భార్యగా మీరూ సర్ ప్రైజ్ చేయండి..

మీ భాగస్వామి ఎప్పుడైనా ఏదైనా విషయం గురించి అలిగితే గనుక మీరు ఈ పద్ధతిని ఫాలో అయితే కచ్చితంగా ఫలితం ఉండొచ్చు. అదేంటంటే.. తనను సర్ ప్రైజ్ చేయడం.. ఉదాహరణకు మీవారికిష్టమైన వంటలను వండి పెట్టడం లేదా వారి దగ్గరకు వెళ్లి ప్రేమగా తినిపించడం.. అలా చేస్తూనే 'నాపై కోపం ఇంకా తగ్గలేదా' ఈ సారికి మన్నించు డియర్ అంటూ మాట్లాడితే చాలు వారి కోపం క్షణాల్లో ఎగిరిపోతుంది. వారికి నచ్చిన పనులు చేయడం.. వారితో ఎక్కువ సమయం గడపడం వంటివి చేస్తే.. వారి అలకను సులభంగా తీర్చొచ్చు. అలాగే - పిలువకురా అలుగకురా...నలుగురిలో నను ఓ రాజా.. పలుచన సలుపకురా..వంటి పాటతో వారి మనసు దోచెయ్యచ్చు.

## అలక తీర్చే బాధ్యత ఇద్దరిది

మీ భాగస్వామి అలకకు మీరే కారణమైతే... అందుకు ఓపెన్‌గా మీరు తప్పు ఒప్పుకోవాలి. ఒకవేళ మీరు వారిపై తీవ్రంగా అసహనం చూపి ఉంటే గనుక.. వారు నార్మల్ స్టేజ్‌కి రావడానికి కొంత ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో మాములూగా మీరు సారీ చెప్పడం.. ఇదొక్కసారికి మన్నించు అని అడిగితే ఫలితం ఉండకపోవచ్చు. ఇలాంటి సమయాల్లో మీరు మీ భాగస్వామిని బాగా బుజ్జగించాలి. 'నా బంగారం.. నా డార్లింగ్.. అంటూ.. ఈ సారికి క్షమించొచ్చు కదా..' అంటే మీ పరిస్థితిని వివరిస్తే.. వారి కోపం త్వరగా చల్లారొచ్చు. అన్నీ మరచిపోతారు.. మీ భాగస్వామి అలక తీర్చే సమయంలో మీరు వారి మనసును బాధపెట్టి ఉంటే.. అలాంటి సమయంలో మీరు ఏదైనా పాత విషయాలను మాట్లాడటం, బాధ పెట్టే మాటలను గుర్తు చేయడం వంటివి అస్సలు చేయొద్దు. దీని వల్ల వారి కోపం మరింత పెరగొచ్చు. కాబట్టి ఇలాంటివి చేయకుండా మీరు వారి అలక తీర్చే మార్గాలను వెతికితే.. వారు అన్నీ మరచిపోయి మిమ్మల్ని త్వరగా క్షమించేస్తారు.

## ఆలోచన మంచిదే.. కానీ

పైన చెప్పిన చిట్కాలన్నీ మీ భాగస్వామి అలిగిన సమయంలో ఒకేసారి ప్రయత్నిస్తే మొదటికే మోసం వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోండి. ఎందుకంటే మీరు వెంటనే బుజ్జగించడం, సారీ చెప్పడం, కారణాలు చెప్పడం వంటివి చేస్తే ప్రతికూల ఫలితం రావొచ్చు. ఒంటరిగా వదిలేయండి.. మీ భాగస్వామి అలక తీర్చడం అనే ఆలోచన చాలా మంచిది. కానీ మీరు కాస్త ఓపిక పట్టాలి. ముఖ్యంగా వారిని కాసేపు ఒంటరిగా వదిలేయండి. వారి కోపం కాస్త తగ్గితే ఆ తర్వాత మీరు పైన చెప్పిన మార్గాలను ప్రయత్నిస్తే ఫలితం రావొచ్చు.

## మిత అలక ప్రమోదం - అతి అలక ప్రమాదం

అలక శ్రుతిమించినా తరచు ఇలానే జరుగుతూ ఉన్నా, మనసులు విరిగిపోయే ప్రమాదం ఉంది. ఒకరి మీద ఒకరికి నమ్మకం పోయిందంటే, భార్యాభర్తల మధ్య దూరం మరింత పెరిగే అవకాశం ఉంది. అలకని ఆయుధంగా ఎంచుకున్న వారికి దాన్ని ఎప్పుడు ఎలాంటి విషయంలో ఉపసంహరించుకోవాలో తెలిసుండాలి. అలా కాకుండా దాన్ని ఇగో ప్రాబ్లెమ్స్‌గా మార్చుకుంటే ఆ చిక్కును విడదీయడం ఎవరితరమూ కాదు. ఎదుటి వ్యక్తీ మానసిక ప్రవర్తనను గమనించి అలకను ప్రదర్శించాలి. అలక మీద ఉన్నవారు పూర్తి స్థాయిలో ముడుచుకుపోయి మౌనంగా ఉండటం అలక కాదు. ఎదుటి వారితో సంభాషిస్తూనే తాము ఏ విషయంలో హర్ట్ అయ్యారో తెలియచేయాలి. అలా అంటే అలక ఆటవిడుపు అయ్యి ఇద్దరు వ్యక్తుల ఆనందాన్ని పెంచుతుంది.

భాగస్వామి అలిగిందన్న విషయం గుర్తించకుండా ఎవరి ధోరణి వారిదే అయితే తనకేం కావాలనే విషయాన్ని కనీసం గుర్తించలేని స్థితిలో ఉన్నారని కోపం ఎక్కువైతే అనర్థాలకు అది దారి తీస్తుంది.

సాధించే భాగస్వామి ఉంటే ప్రతీ విషయానికీ ఇలాగే జరుగుతుంది. మాట మాట అనుకుంటూ ఉంటే ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ తగ్గిపోయే అవకాశమూ ఉంది. కొందరు తాము అలిగితే ఆ విషయం ఎదుటివారికి తెలియాలని తమకి నష్టం చేసుకుంటారు. ఉదాహరణకి తిండి తినకుండా మానేయటం, శరీరాన్ని గాయపర్చుకోవడం వంటివి ఎన్నో, ఇలాంటివి కూడదు.

## ఆడవారి కోపంలో అందమున్నది, అనర్థమూ ఉన్నది

పంతానికి పోయేంత, సంబంధాలను త్రెంచేంతటి అలకను అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. అలిగే బిడ్డతో చెలిగే గొడ్డుతో వేగడం కష్టం అన్నట్టు అలక ఆనందదాయకమే కాదు అనర్థదాయకం కూడా. ఆడ గయ్యాళి ఆయిన ఓ అందమైన స్త్రీ అలుక వహించి, అలుక తీర్పవచ్చిన తనను మోహించిన రాజుతో మహా మహితాత్ములైన యహ్యా(అ) గారి తల బహుమానంగా తెమ్మని అడిగింది. ప్రియురాలి అలక తీర్చాలన్న ఆరాటంలో ఆ పరమ పాపి ఏకంగా ఆ మహాత్ముని తలనే పళ్లెంలో పెట్టి ఆ ఆడ దెయ్యం అలక తీర్చాడు. ప్రతిగా అల్లాహ్ ఆగ్రహానికి గురయ్యాడు. (ఇమామ్ తబరీ (రహ్మ) గారి చరిత్ర గ్రంథం)

## ఆఫీసులో అలక కూడదు

ఆఫీసన్నాక భిన్న మనస్తత్వాలు, వ్యక్తిత్వాలు ఉన్నవారితో కలిసి పని చేయాల్సి ఉంటుంది. మాట పట్టింపులు, చిన్న తగాదాలు సాధారణమే! కొందరి తీరు వల్ల పనిపైనా ప్రభావం పడుతుంది.

ఇంట్లో చిన్న చిన్న తగాదాలు సాధారణమే కదా! అప్పుడేం చేస్తాం.. వీలైతే సర్దుకుపోతాం లేదంటే అలక చూపిస్తాం. ఆఫీసులో అలకంటే కష్టమే! దూరంగా ఉండటమూ సాధ్యం కాదు. కాబట్టి, సమస్య ఎంత పెద్దదో ఆలోచించుకోండి. వ్యక్తిగతం కాదనిపిస్తే అంతటితో వదిలేయడమే మేలు. వాదనకు దారితీసిన అంశంపై మళ్లీ మాట్లాడుకోకపోతే ఇంకా మంచిది.

➢ 'మనకు పిల్లలు, ఇంటి బాధ్యతలుంటాయి. అవి ఇతరులకీ అర్థమవ్వాలనేంలేదు. దీంతో ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండాలని ఆశిస్తుంటారు. లేకపోతే విభేదాలు. వాళ్లే అర్థం చేసుకోవాలి అనుకున్నంత కాలం పరిస్థితిలో మార్పుండదు. కాబట్టి నోరు తెరవండి.

➢ ఎంతసేపు మన కోణంలోనే ఆలోచిస్తేనే తేడాలొచ్చేది. అవతలి వాళ్ల గురించీ ఆలోచించాలి. అందరినీ కలుపుకొంటూ వెళ్లాలి. నేను సాయపడను కానీ అందరూ నాకు సహకరించాలన్న తత్వం పనిలోనే కాదు.. పక్కవారితో బంధం ఏర్పరచడంలోనూ చేటే చేస్తుంది.

➢ అన్నింటికీ ఫిర్యాదు చేయడం మంచిది కాదు. నిజమే.. కానీ అవతలి వాళ్లు మిమ్మల్ని టార్గెట్ చేస్తున్నా.. అధికార బలంతో ఇబ్బంది పెడుతున్నా.. అదనపు భారం వేస్తున్నా పై అధికారి లేదా పరిష్కరించగలిగే వ్యక్తికీ ఫిర్యాదు చేయండి. అప్పుడు సర్దుకుపోవద్దు.

## చివరి మాట

అలుగుటయే ఎరుగని మహా మహితాత్ములు మహనీయ ముహమ్మద్(స) వారే అలిగినారు. ఆయన సహచరుల శిక్షణార్థం ఆయన ఎన్నో సందర్భాల్లో చిరు కోపాన్ని ప్రదర్శించారు. వారికి కావాల్సిన శిక్షణ ఇచ్చి మానవ జాతి రత్నాలుగా వారిని తీర్చిదిద్దారు. జగమంతా ఇంటింటా కోపాలు లేకుండా ప్రేమ దీపాలు వెలిగించుకుంటే అప్పుడే నిజమైన సంతోషం.

[redacted]

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది     ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

27-29 అల్లాహ్ తన దాసులందరికీ ఒకవేళ విస్తృత ఉపాధిని అనుగ్రహించి ఉన్నట్లయితే వారు భువిలో తిరుగుబాటు తుఫాను రేపి ఉండేవారు, కాని ఆయన ఒక లెక్క ప్రకారం తాను కోరిన మేరకు అవతరింపజేస్తాడు నిస్సందేహంగా ఆయన తన దాసులను గురించిన సమాచారం బాగా ఎరిగినవాడు, వారిని కనిపెడుతూనూ ఉన్నవాడు.[48]

ఆయనే, జనులు నిరాశ చెందిన తరువాత వాన కురిపిస్తాడు, తన కారుణ్యాన్ని వ్యాపింపజేస్తాడు ఆయనే స్తవనీయుడయిన సంరక్షకుడు.[49] ఆయన సూచనలలోనిదే ఈ భూమీ ఆకాశాల సృజన ఇంకా ఉభయత్రా ఆయన వ్యాపింపజేసిన జీవరాశుల సృష్టి.[50] ఆయన వాటిని తాను కోరినప్పుడు ఎప్పుడయినా ఏకత్రం చేయగలడు.[51]

30 మీకు ఆవహించిన ఏ విపత్తు అయినా మీరు చేజేతులా సంపాయించుకున్నదే, మరి అనేక తప్పిదాల పట్లనయితే ఆయన ఇట్టే చూపోపు వహిస్తాడు.

48. ఏ వచన క్రమంలోనయితే ఈ మాట పలకడం జరిగిందో దాన్ని దృష్టిలో ఉంచుకున్నట్లయితే అంతా స్పష్టంగా ద్యోతక మవుతుంది. ఇక్కడ వాస్తవానికి పరమ ప్రభువు మక్కా తిరస్కా రుల తలబిరుసుతనం వెనక పనిచేస్తున్న ఆ మౌలిక మయిన కారణాన్ని సూచిస్తున్నాడు. రోమా, ఈరాన్ రాజ్యాల ముందు వారికి ఏ స్థానమూ లేకపోయినా, చుట్టుపట్లనున్న జాతులన్నిం టిలో వారు కేవలం ఒక వెనకబడ్డ జాతి, వ్యాపారం వృత్తిగా గల తెగ మరోవిధంగా చెప్పాలంటే దేశదిమ్మరుల్లాంటి స్థితికి మించిన స్థితి వారికి లేకపోయినా, ఆ చిన్నారిలోకంలో ఇతర అరబ్బు తెగలూ జాతుల మధ్య వారికి కొంత సంపన్నత, పెద్దరికం ప్రాప్తమయి ఉండేవి. ఈ కాస్త విషయమే వారిని ఎంతో గర్విష్ఠులుగా, దురహంకారులుగా చేసివేసింది. వారు దైవప్రవక్త మాటను సయితం ఖాతరు చేయడానికి ఏ విధంగానూ సిద్ధంగా లేరు. వారి తెగల నాయకులు, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్-సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తమకు నాయకుడవడాన్ని, తాము ఆయన్ని అనుసరించడాన్ని సుతరామూ ఇష్టపడటం లేదు. అది తమ స్థాయికి తగని విషయంగా వారు పరిగణిస్తున్నారు. ఈ కారణంగానే ఇలా సెలవీయడం జరుగుతుంది, మేము ఈ సంకుచిత మనస్కు లకు నిజంగానే ఉపాధి ద్వారాలు పూర్తిగా తెరచివేసి ఉన్నట్ల యితే వీరు పూర్తిగానే పొంగిపోయేవారు. అయితే మేము అంతా గమనించేపెట్టాము. మేము ఆచితూచియే వారికి ఇస్తున్నాము. వారు తమ స్థాయిని మించి పోనంతగానే ఇస్తు న్నాము. ఈ భావం రీత్యా ఈ ఆయత్ వేరే మాటల్లో ఇతర సూరాలలో వచ్చిన విషయాన్నే తెలియజేస్తోంది: తౌబా: 68, 70; అల్ కహ్ఫ్: 32, 42; అల్ కసస్:75,82; అర్ రూమ్:9; సబా:34, 36; అల్ మూ'మిన్:82, 85.

49. మూలంలో 'వలీ' అనే పదం వచ్చింది. ఇక్కడ 'వలీ' (లేదా సంరక్షకుడు) అంటే ఉద్దేశం, తాను సృష్టించిన సమస్త సృష్టిరాశుల వ్యవహారాలను కనిపెట్టుకుని ఉన్న సంరక్షకుడు అన్నది. ఆయనే తన దాసుల అవసరాలు, ఆవశ్యకతలను నెరవేర్చే బాధ్యత తనపైన వేసుకున్నాడు.

50. అంటే, భూమిపైనా, ఆకాశాలలోనూ. జీవితం అన్నది కేవలం భూమిపైనే కాదు, ఇతర గ్రహాలలోనూ ప్రాణులున్నా రనేందుకు ఇది స్పష్టమయిన సంకేతం.

51. అంటే, ఏ విధంగానయితే ఆయన వారిని విస్తరింప జేసేందుకు సమర్థుడో అదే విధంగా ఆయన వారిని ప్రోగు చేయడానికీ సమర్థుడే, అందువల్ల, ప్రళయం రాజాలదని, తొలి జనులూ కడజనులూ ఎల్లరినీ ఒకేసారి లేపి ప్రోగు చెయ్యడం సాధ్యం కాదని అనుకోవడం సరికాదని అర్థం.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

## సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

# మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) గొప్పతనం

**341)** హజ్రత్ అనస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి ఉహుద్ పర్వతంపైకి ఎక్కినప్పుడు, ఆయన వెంట అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్(రజి)లు కూడా ఉన్నారు. ఉహుద్ పర్వతం వణకసాగింది. అప్పుడు దైవ ప్రవక్త(స), "ఉహుద్! శాంతించు– బహుశా ఆయన(స) తన కాలితో దానిని కొట్టారనుకుంటాను– నీ మీద ఒక దైవసందేశహరుడు, ఒక సత్యసంధుడు, ఇద్దరు అమరవీరులు ఉన్నారు" అని పలికారు.

**343)** ఉస్మాన్ బిన్ మౌహబ్ కథనం: ఈజిప్టు దేశానికి చెందిన ఒక ఆగంతకుడు వచ్చి కాబా గృహాన్ని సందర్శించి హజ్జ్ చేశాడు. తరువాత అతను అక్కడ కూర్చున్న వారిని ఉద్దేశించి, 'వీరెవరు?' అని అడిగాడు. 'వీరు ఖురైషులు' అని ఎవరో చెప్పారు. 'వీరిలో అందరికన్నా పెద్దవారెవరు?' అని ఆ వ్యక్తి అడిగాడు. 'అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)' అని జనులు చెప్పారు. అప్పుడతను, 'ఓ ఇబ్నె ఉమర్! నేను మీకు కొన్ని ప్రశ్నలు వేయదలిచాను. మీరు నన్ను సమాధానపరుస్తారని ఆశిస్తాను. ఉహుద్ యుద్ధ సమయంలో ఉస్మాన్(రజి) పరారయ్యారన్న సంగతి మీకు తెలుసా?' అని అడిగితే, "అవును. అలా జరిగిన సంగతి వాస్తవమే" అని ఇబ్నె ఉమర్(రజి) చెప్పారు. తరువాత ఆ వ్యక్తి 'ఆయన బద్ర్ సంగ్రామంలో పాల్గొనలేదన్న సంగతి మీకు తెలుసా?' అని ప్రశ్నించాడు. "తెలుసు" అని ఇబ్నె ఉమర్ (రజి) బదులిచ్చారు. 'ఆయన బైఅతె రిజ్వాన్‌లో కూడా పాల్గొనలేదన్న విషయం మీకు తెలుసా?' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, "అవును. అది కూడా నిజమే" అని ఇబ్నె ఉమర్ (రజి) జవాబిచ్చారు. ఇది వినగానే ఆ వ్యక్తి 'అల్లాహు అక్బర్' అన్నాడు. అప్పుడు ఇబ్నె ఉమర్(రజి) ఆ వ్యక్తితో "ఇలా దగ్గరకు రా. ఈ సంఘటనల వెనుక ఉన్న అసలు విషయాన్ని నేను నీకు విశదపరుస్తాను" అన్నారు.

"ఉహుద్ యుద్ధరంగం నుంచి పారిపోవటం గురించి నేను ఇచ్చే సాక్ష్యమేమిటంటే, అల్లాహ్ ఆయన్ని క్షమించాడు. ఇక బద్ర్ సంగ్రామంలో ఆయన పాల్గొనలేకపోవడానికి కారణమంటావా, ఆయన సతీమణి అయిన దైవప్రవక్త పుత్రిక ఆ సమయంలో వ్యాధిగ్రస్తులై ఉన్నారు. 'నీవు రోగిని కనిపెట్టుకుని ఉండు. యుద్ధంలో పాల్గొన్నవారికి లభించినంత పుణ్యఫలమే నీకూ లభిస్తుంది. అలాగే యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)లో కూడా నీకు వాటా లభిస్తుంది' అని దైవప్రవక్త(స) సమాదాయించారు. ఇక 'రిజ్వాన్ ప్రతిజ్ఞ' (బైఅతె రిజ్వాన్)లో ఉస్మాన్(రజి) పాల్గొనలేక పోవటానికి కారణమేమిటో తెలుసా? ఆ సమయంలో ఆయన దైవ ప్రవక్త(స) ఆజ్ఞానుసారం మక్కా నగరంలో ప్రవేశించారు. ఆ సమయంలో మక్కాలో ఉన్న ముస్లింలలో ఉస్మాన్ (రజి) కన్నా ఎక్కువ మర్యాదస్తులు, ప్రముఖులు లేరు. ఈ కారణంగానే దైవప్రవక్త(స) ఆయన్ని ఖురైషులతో చర్చలు జరిపే నిమిత్తం మక్కాకు పంపించారు. 'బైఅతె రిజ్వాన్' జరిగే సమయానికి ఉస్మాన్ (రజి) మక్కా చేరుకున్నారు. ఆ సమయంలో దైవప్రవక్త (స) తన కుడి చెయ్యిని ఎత్తి 'ఇది ఉస్మాన్ చెయ్యి' అని పలికారు. తరువాత తన రెండో చేతిపై చెయ్యివేసి 'ఇది బైఅతె ఉస్మాన్ తరపున' అని కూడా పలికారు. ఆ తరువాత ఇబ్నె ఉమర్(రజి) ప్రశ్నించిన ఆగంతకుణ్ణి ఉద్దేశించి, "పో. పోయి ఈ విషయాలను బాగా జ్ఞాపకం ఉంచుకో" అన్నారు.

★★★



# అరబ్బుల ప్రత్యేకతలు

- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**ఇన్ని చెడుగులు,** అవగుణాలున్నప్పటికీ అరబ్బులలో ప్రపంచం లోని వేరితర జాతులలో లేని కొన్ని ప్రత్యేకతలుండేవి. వారిలోని ఈ స్వతఃస్సిద్ధమయిన విశిష్టతల కారణంగానే విశ్వేశ్వరుడు వారిని తన దైవదౌత్యం, షరీఅత్ రక్షణ కొరకు తగినవారుగా భావించాడు. తన ప్రత్యేక అనుగ్రహంతో వారిని సత్కరించాడు.

## వంశ పారంపర్యం

ఆ ప్రత్యేకతల్లో మొట్టమొదటిది వారి వంశపరంపర. ఉత్తర అరేబియాలోని తెగలన్నీ ప్రవక్తల పితామహుడు హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) సంతతికి చెందినవి. వంశ పారం పర్య చరిత్రలో ప్రవీణులైనవారు, యూదు మత ప్రఖ్యాత విద్వాం సులు సయితం దీనిని ఖండించలేకపోయారు. వంశవృక్షంపై వారు చెప్పే కథనాల ద్వారా ఒక్కో శతాబ్దంలోని పూర్వీకుల ఆధారాలు దొరుకుతాయి. బహుశా ఈ కారణంగానే నేమో సెంట్‌పాల్ తన లేఖలలో అరబ్బు హాజిరా (హాగరు) ఉపమానం ఇచ్చేవాడు *(సెంట్ పాల్ గలతీయులకు వ్రాసిన పత్రిక - 4 : 25).*

కాగా; దివ్య ఖుర్‌ఆన్ అరబ్బులనూ, ముఖ్యంగా ఖురైషులను సంబోధించి ఈ విషయాన్ని మరింత స్పష్టపరచింది.

> **"మీ పితామహుడు ఇబ్రాహీమ్ జీవన విధానంపై స్థిరంగా ఉండండి."** *(అల్ హజ్జ్ : 78)*

వంశ ప్రముఖుల పేర్లను చెబుతూ రెండున్నర వేల సంవత్సరాలు వెనక్కిపోయి, మూలాల (Roots) ను పట్టుకునేటప్పుడు మధ్యలో అక్కడక్కడా కొన్ని పేర్లు మరచిపోవటం, లేక హెచ్చుతగ్గులు జరగటం సహజమే. కాని వారు పేర్కొనే వంశధార ప్రకారం, వారు సిసలైన ఇబ్రాహీమ్ సంతతి వారనటంలో సందేహానికి తావేలేదు. అదీ వారి జీవన శైలి గురించి, నైజం గురించి తౌరాతులో చెప్పిన విషయాలు, ఖుర్‌ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన విషయాలు దాదాపు ఒకేవిధంగా ఉన్నాయి. అవే గుడారాలు, అవే ఎడారులు, అదే పశుసంపద, అదే అపసవ్యమైన జీవనం, అవే ఆచారాలు! ఇస్లాం వచ్చాక వాటిని తీర్చిదిద్దింది. బైతుల్లాహ్, అక్కడ జరిగే ఖుర్బానీ ఆచారాలు, హజ్జ్ క్రియలు – ఇవన్నీ ఇప్పటికీ ఐరోపా పరిశోధకుల కళ్ల ముందు కదలాడుతున్నాయి. ప్రఖ్యాత జర్మన్ పరిశోధకుడు నోల్డేక్ ఇలా వ్రాస్తున్నాడు :

"ఇంకనూ అరబ్బులలో ప్రాచీన 'సామీ' కేరెక్టర్ ఒక ప్రత్యేక రంగులో మిగిలి ఉన్నట్లు భావించబడుతోంది. వారి భాష కూడా అసలు భాషకు చాలా సమీపంలో ఉంది."★

★ "ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా"లో అల్ సినా సామియ అనే పేరుతో వచ్చిన వ్యాసం చదవండి. నేను 'అర్జుల్ ఖుర్‌అన్' మొదటి సంపుటంలో 107వ పేజీ నుండి 116వ పేజీ వరకు దీనిపై సహేతు కంగా చర్చించాను. దీనిపై ఐరోపా విద్వాంసుల రెఫరెన్సులను ఒకచోట చేర్చాను. **- రచయిత**

అరబ్బులకు తమ వంశపారంపర్య, తమ కులగోత్రాల పట్టింపు అంతా యింతా కాదు. దాని ప్రస్తావనతో చరిత్ర పుస్తకాలు కూడా నిండి ఉన్నాయి. తమ వంశ పారంపర్యంపై గర్వపడటం, కవిత్వంతో తమ తాతముత్తాతల ఘనకార్యాలను గురించి చెప్పుకుని గర్వాతిశయంతో పొంగిపోవటం వారికి ఉగ్గుతో పెట్టిన విద్య. మనుషుల సంగతిని అలా ఉంచితే, కొన్ని రకాల పశువుల (గుర్రాల) వంశాల గురించి వారు ఏకరువు పెట్టేవారు. తెగల వంశవృక్షాన్ని జ్ఞాపకం ఉంచుకునే కొందరు ప్రత్యేక వ్యక్తులు ప్రతి తెగలో ఉండేవారు. ఈ కారణంగానే నేటికీ వారి ప్రముఖ నాయకుల పేర్లు ఇప్పటికీ తెలుస్తాయి. దీనిపై ఎన్నో ముఖ్య పుస్తకాలు రాయబడ్డాయి. ఈ ప్రత్యేకత ప్రపంచంలో ఒక్క అరబ్బులకే స్వంతం. యూదులు, ఇస్రాయీల్ సంతతివారు కూడా హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) సంతతికి చెందినవారే అయి నప్పటికీ ఈ విషయంలో మటుకు వారు అరబ్బులతో సరితూగ లేరు. ఇతర జాతులు సమ్మిళితం అయిన కారణంగా నైతేనేమీ, వారు ఒక ప్రత్యేక ప్రదేశానికి పరిమితం కాకపోవటం వల్లనైతేనేమీ ఈ ప్రత్యేకతను యూదులు కోల్పోయారు.

'వంశం' అనేది స్వయంగా గర్వించదగిన వస్తువేమీ కాదు. అందుకే మహాప్రవక్త ముహమ్మద్ (స) 'ఆచరణ'కు ప్రతిగా వంశపరంపరపై గర్వపడటాన్ని అంతమొందించారు. కాని దైవప్రవక్త మహనీయ ఇబ్రాహీమ్ (అ) తన సంతతి సన్మార్గం కొరకు ప్రత్యేకంగా ప్రార్థించివున్నారు. కాబా గృహ సేవల బాధ్య తను వారికి అప్పగించారు. తన ఈ సంతతిలో (ఇస్మాయీలీ వంశంలో) ఒక ప్రవక్తను ప్రభవింపజేయమని, ఆ ప్రవక్త ద్వారా వీళ్ళ జీవితాలను తీర్చిదిద్దమని కూడా ప్రార్థించారు. దేవునితో ఇబ్రాహీమ్ (అ) చేసుకున్న ఒడంబడిక నెరవేరడానికి, ఆ వంశం స్వచ్ఛంగా ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకే అల్లాహ్ వారికి ఈ పురస్కారాన్ని ప్రసాదించాడు.

## వేరొక మతంలో ప్రవేశించలేదు

జాతుల ఆచార వ్యవహారాలను, అలవాట్లను మార్చివేసే పద్ధతు లన్నింటికీ వారు ఆమడ దూరాన ఉండేవారు. ఉదాహరణకు– తాము నివసించే ప్రదేశాలకు నలువైపులా వివిధ సుప్రసిద్ధ మతావలంబీకులు ఉన్నప్పటికీ అరబ్బులు మాత్రం వారి జీవన ప్రవాహంలో కొట్టుకుపోలేదు. ఆనాడు పారసీక మతం పర్షియన్ జలసంధి మొదలుకుని యమన్ వరకు విస్తరించి ఉండేది. యూదులు యమన్, హిజాజ్ క్షేత్రాలలోని వర్తక కేంద్రాలపై తమ పట్టు బిగించి ఉండేవారు. క్రైస్తవులు తమ సైనిక పటాలాలతోనూ, సన్యాసులు, మత ప్రచారకులతోనూ ఇటు యమన్ నుండి అటు సిరియా సరిహద్దుల వరకూ విస్తరించి ఉండేవారు. కొంతమంది వ్యక్తులను, కొన్ని తెగలను వారు నామకా క్రైస్తవులుగా మార్చేసారు కూడా. కాని యావన్మంది అరబ్బులు తమ వైశిష్ట్యాన్ని కోల్పోకుండా ఉన్నారు. వారిలోని సౌజన్యవంతులు, ధార్మికులు పారసీకులుగా, యూదులుగా, క్రైస్తవులుగా మారకుండా తమను తాము ఇబ్రాహీమ్ ధర్మావ లంబీకులుగా చెప్పుకునేవారు. అంతేకాదు తమ మతాన్ని 'దీనె హనీఫీ'గా ప్రస్తుతించేవారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారిని 'దీనె ఇబ్రాహీమీ' వైపునకు పిలిచినప్పుడు వారి నుండి సకారాత్మక స్పందన రావడానికి, వారి కొరకు మార్గం తెరువబడి ఉండటానికి దైవికంగా జరిగిన ఏర్పాటు ఇది.

## వారు పాలితులు కారు

అరేబియా రాజ్యం విశ్వమండలం పుట్టినప్పటి నుండి ఇస్లాం ప్రభవనం వరకు అన్ని జాతుల దాడుల నుండి నిత్యం సురక్షి తంగా ఉండింది. ఉత్తర అరేబియా వాసులు ఎప్పుడూ ఏ జాతి వారికీ బానిసలుగా ఉండలేదు. బాబిలోనియా రాజు బఖ్తనసర్ బనీ ఇస్రాయీల్‌ను తలక్రిందులుగా చేసేశాడు కాని అరేబియా భూభాగం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈరానీయులు, రోమ నులు ఈజిప్టు నుండి ఇరాక్ సరిహద్దు వరకు శతాబ్దుల తరబడి పరిపాలించాయి. కాని అరేబియాలో మాత్రం అడుగు పెట్టలేక పోయాయి. ఆ తరువాత అలెగ్జాండర్, అతని సైన్యాధికారులు గిల్లికజ్జాలు పెట్టుకునేందుకు యత్నించారు. కాని ప్రకృతి వారిని సదా పరాభవం పాల్జేసింది. అరేబియా రాజ్యం రెండు మహా సామ్రాజ్యాల, అంటే పారసీక – రోము సామ్రాజ్యాల సరిహద్దుల్లో ఉండేది. కాని ఆ రెండు సామ్రాజ్యాలు కూడా ఎన్నడూ అధికార దాహంతో ఈ ప్రాంతం వైపునకు చూడలేదు. ఇథియోపియాకు చెందిన క్రైస్తవులు మాత్రం యమన్‌ను జయించిన తరువాత ఏనుగులను తీసుకుని మక్కాను జయించే ఉద్దేశంతో దండెత్తి వచ్చాయి. కాని దేవుడు వారి దురుద్దేశాన్ని తిప్పికొట్టాడు. అత్యంత అవమానకరమైన రీతిలో అబ్రహా సైన్యం వెనుతిరగ వలసి వచ్చింది. అరబ్బుల మనోమస్తిష్కాలపై వేరొకరి పెత్తనం ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఈ ఏర్పాట్లన్నీ జరిగాయి.

## ప్రక్షిప్తాలకు లోనైన గ్రంథజ్ఞానం వారికి లేదు

బయటి ప్రభావాలకు లోనవకుండా, వారు స్వతంత్రంగా ఉన్నట్లే మానవ నైజంలో ప్రోదిచేయబడిన 'ప్రాకృతిక జ్ఞానం' తప్ప మరొక గ్రంథజ్ఞానం వారికి లేదు. అంటే మానవ ప్రక్షిప్తాల వాతనపడిన గ్రంథాల గురించి వారికి బొత్తిగా తెలియదు. వారు

అజ్ఞానులు, ఉమ్మీలు. చదువురాని వారు. ఉమ్మీ ప్రవక్త చేసే ప్రబోధనలు వినడానికి వారి అంతరాళం ఆసక్తితో ఎందురు చూస్తూ ఉండేది.

## వారు నేల నడిబొడ్డున నివసించేవారు

భౌగోళికంగా అరబ్బు భూభాగం ప్రాచీన ప్రపంచానికి నడి బొడ్డున ఉంది. దానికి ఒక వైపున ఆసియా, మరోవైపున ఆఫ్రికా ఖండాలుండగా, ఇంకొకవైపున ఐరోపా ద్వారం చాలా దగ్గరలో ఉంది. అదీగాక సముద్రమార్గం, ఓడరేవు వారిని దూరదేశాలను దగ్గరకు చేర్చింది. అందుకే వారు అరేబియా నుండి బయలుదేరి ఒక వైపున ఇరాక్, ఈరాన్, తుర్కిస్తాన్, ఖురాసాన్‌లను చుట్టు ముడుతూ కాబూల్, భారతదేశం వరకూ చేరుకున్నారు. మరో వైపున సిరియా, ఈజిప్టు, ఆఫ్రికా, అల్జీరియా, ట్యునీషియా, మొరాకో, స్పెయిన్ వరకూ చేరుకున్నారు. ఇంకొక వైపున సముద్ర మార్గాల ద్వారా ఆఫ్రికా దీవుల్ని, ఇథియోపియాను చేరుకున్నారు. అంతేకాదు హిందూ మహాసముద్రంలోని దీవులలో, జావా, సుమిత్రాలలో కూడా పర్యటించారు. చైనా వరకూ వెళ్ళారు. సైప్రస్, క్రీట్, సిసిలీలలో సైతం తమ పతాకాన్ని ఎగురవేశారు. ఇన్ని అవకాశాలు వారికి ఎందుకు లభించా యంటే అరబ్బుల నివాస స్థలం సందేశ ప్రచార కార్యానికి ఎంతో అనువైనది. అదే భారతదేశమో, చైనాయో అయివుంటే స్పెయిన్, సిసిలీ వరకూ చేరటానికి చాలా సమయం పట్టేది. అదీగాక ఆనాడు ప్రపంచాన్ని రెండు తూరుపు, పశ్చిమ శక్తులు శాసిస్తూ ఉండేవి. ఆ రెండింటి మెడలు వంచాలంటే ఒక్క అరబ్బు భూభాగం తప్ప మరే ప్రదేశం కూడా అనువైనది కాదు. ఏక కాలంలో ఆ రెండింటిపై విరుచుకుపడి ప్రపంచాన్ని వాటి అమానుష చర్యల నుండి విముక్తి కలిగించడానికి అంతకన్నా మంచి స్థావరం మరొకటి ఉండదు.

## కొన్ని నైతిక సుగుణాలు

వీటన్నింటితో పాటు అరబ్బులలో ఖైరుల్ ఉమమ్ అయ్యే, లోకానికి ఆదర్శప్రాయం అయ్యే, సంస్కర్తలుగా రాణించే లక్షణాలు పుష్కలంగా ఉండేవి. ఈ సుగుణాలు లేకుండా వారు బ్రహ్మాండమైన ఇస్లామీయ ఉద్యమానికి ధ్వజవాహకులు కాలేరు. ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించే బాధ్యతను కూడా నిర్వర్తించలేరు.

## శౌర్యం, పరాక్రమం

వారు ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. వారు పొంచివున్న ప్రమాదాలకు భయపడేవారు కారు. యుద్ధాన్ని ఒక క్రీడకన్నా ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇచ్చేవారు కారు. ఈ కారణంగానే వారు ప్రపంచంలోని బలోపేతమైన జాతులకు, సామ్రాజ్యాలకు ప్రతిగా ఒంటరిగా నిలబడ్డారు. ఖైసర్ కిస్రాలకు (రోము, ఈరాన్‌లకు) వారు ఒకే సమయంలో సవాలు విసిరారు. తమ ఉద్యమ పరివ్యాప్తికై నిరాయుధులైన తమ చిన్న చిన్న దళాలతోనే భారీ సైనిక పటాలాలను మార్కొని విజయకేతనం ఎగురవేశారు.

## ఔత్సాహికులు

వారిలో ఉత్సాహం ఉరకలు వేసేది. అందువల్ల తాము ఏ సందే శాన్ని, మరే ఉద్యమాన్ని తీసుకుని బయలుదేరారో దానిని ప్రపంచం నలుమూలలా వ్యాపింపజేశారు. వారిలోని ఉత్సా హాన్ని, ఆవేశాన్ని ఏ పర్వతమూ అడ్డుకోలేకపోయింది. ఏ సముద్ర కెరటం కూడా వారిని వారించలేకపోయింది. ఎల్లెడలా వారు ఏకేశ్వరోపాసనా (తౌహీద్) ధ్వజాన్ని చేబూని ఉండేవారు. నేల మీదనయినా, నీటిలోనయినా వారి వజ్ర సంకల్పం ముందు లక్ష్యం సులభతరమవుతూ పోయింది.

## సత్యం చెప్పేవారు

శారీరక శౌర్యంతో పాటు మనోబలం, గుండె ధైర్యం వారి సొంతం. వారి గుండెలో ఉన్నమాటే వారి గొంతు దాటి బయ టకు వచ్చేది. మదీనాలోని కొన్ని వర్గాలలో కాపట్య (నిఫాఖ్) రోగం పుట్టిందంటే అది యూదుల సావాస దోషమే. ఖురైషులలో గానీ, అరేబియా వాసులలో గానీ ఆ జాడ్యం ఉండేది కాదు. వారు స్నేహం చేస్తే నిజమయిన స్నేహితులుగా ఉండేవారు. శత్రుత్వం వహించినా అంతే. సత్యాన్ని ప్రకటించేటప్పుడు ఎవరికీ భయపడకుండా నిర్మొహమాటంగా సత్య ప్రకటన చేసేవారు. వారి మాటలకు – చేతలకు మధ్యన వైరుధ్యం ఉండేది కాదు.

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***

**(మిగతా వచ్చే సంచికలో)**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## 'చరిత్రార్థులు'-2



# మున్షీ జకీయుద్దీన్ అహ్మద్

## (-1872)

**28**




**బ్రిటిషర్లను** మట్టి కరిపించేందుకు ఉమ్మడి రణ తంత్రాన్ని ఆశించి, ఆ దిశగా వ్యూహాలను రూపొందించిన యోధులలో ఒకరయిన మున్షీ జకీయుద్దీన్ అహ్మద్ ప్రస్తుత ఛత్తీస్‌ఘర్ రాష్ట్రం దుర్గ జిల్లా లోని జాంగావ్‌లో జన్మించారు. ఆయన తండ్రి హజరత్ ముఫ్తీ ఇస్మాయిల్ ప్రముఖ పండితులు. తండ్రి మార్గదర్శకత్వంలో పలువురు ప్రముఖ విద్యావేత్తల వద్ద విద్యను అభ్యసించాక, ఢిల్లీ పాదుషా బహద్దూర్ షా జఫర్ దూతగా బుందేల్‌ఖండ్‌కు వచ్చి పలు పదవులు నిర్వహించారు. ఆ తరువాత స్వగ్రామం చేరుకున్న జకీయుద్దీన్ ప్రముఖ వకీల్‌గా, కవిగా గణుతికెక్కారు. 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ భేరి మ్రోగగానే కార్యరంగంలోకి దిగిన ఆయన మాతృభూమి కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి త్యాగం చేయ గల యువకులను సమీకరించి పోరుకు సిద్ధమయ్యారు. 1857 ఆగస్టు మూడున ఆంగ్లేయుల మీద విరుచుకుపడడానికి మూహూర్తం నిర్ణయించి, ఒక వ్యూహం ప్రకారంగా అన్ని ప్రాంతాలలో తిరుగుబాటు జ్వాలలను రగిలించాలని పథకాన్ని రూపొందించారు. ఆ ప్రయత్నంలో స్థానికుల పొరపాటు వలన మున్షీ జకీయుద్దీన్ అహ్మద్ పథకం వివరాలు కాస్తా ఆంగ్లేయాధికారులకు చేరాయి. ఆయన మీద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పూర్తి వివరాలు తెలుసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాధికారులు భారీ బలగాలతో దాడి చేయగా మున్షీ జకీయుద్దీన్ తన సహచరులతో కలసి పోరాడారు. ఈ పోరాటంలో పలువురు ఆంగ్లేయాధికారులను వధించి నప్పటికి చివరకు మున్షీ జకీయుద్దీన్ అహ్మద్‌ను ఆయన సహచరులను కంపెనీ సైన్యాలు నిర్బంధించ గలిగాయి. ఆనాటి 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా', 'హిందూ పేట్రియాట్', 'బగావత్-ఎ-హింద్' లాంటి పత్రికలు, 'రీజినల్ రికార్డ్స్ సర్వే కమీటీ' (బీహార్) లాంటి నివేదికలు ఈ విషయాన్ని ప్రచురిస్తూ మున్షీ జకీయుద్దీన్ వ్యూహరచన, ప్రజల సమీకరణ, ఆయన సాహసాన్ని ప్రస్తావిస్తూ, పరిణామాల గురించి భయాందోళనలను వ్యక్తం చేశాయి. కలకత్తాకు చెందిన 'ఇంగ్లీష్ మాన్' పత్రిక తన 1857 జూలై 17 తేదినాటి సంచికలో 'ఒకవేళ వృద్ధ వకీల్‌ను కనుక తన పథకం ప్రకారంగా ముందుకు సాగనిచ్చి యున్నట్టయితే అతను ఈ ప్రాంతంలో భయోత్పాతం సృష్టించి ఉండేవాడు అనటంలో ఏ మాత్రం సందేహంలేదు', అని ఆంగ్లేయాధికారుల మాటలను ఉటంకించింది. అనంతరం మున్షీ జకీయుద్దీన్ అహ్మద్‌ను భాగల్‌పూర్ జిల్లా కమీషనర్ కార్యాలయానికి తరలించి విచారణ జరిపిన ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం ఆయనకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించింది. ఆ తీర్పు ప్రకారం ఉరిశిక్ష అమలు జరిగేలోపు బ్రిటిష్ రాణి విక్టోరియా ప్రకటన వలన ఆ ఉరిశిక్ష రద్దయ్యింది. ఆంగ్లేయుల నిర్బంధం నుండి విడుదలైన మున్షీ జకీయుద్దీన్ అహ్మద్ 1872లో కన్నుమూసేంతవరకు ఆంగ్లేయుల విధానాలను, పాలనా పద్ధతులను వ్యతిరేకిస్తూనే గడిపారు. ✤




**9440241727**


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరిత్రార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




**- డాక్టర్ ముహమ్మద్ హసన్, రాజకీయ విశ్లేషకులు,**

**మనిషి** ప్రస్థానం ఎక్కడి నుండి ఎక్కడ వరకు మొదలైంది, మానవ నాగరికత పరిణామ క్రమంలో మనిషి "నిప్పును" కనిపెట్టిన తర్వాతే, అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. అనంతరం "చక్రం" ఆవిష్కరించిన తర్వాత ఆధునిక సమాజాలు వెలిశాయని ప్రముఖ చరిత్రకారుడు "గోర్డన్ చైల్డ్" అంటాడు. అంటే మనిషి లక్షల సంవత్సరాలుగా నిరంతరం ఎదో ఒక దానితో పోరాటం చేయటం నిత్యకృత్యమై నది, ఇప్పుడు మనం భౌతికంగా అనుభవిస్తున్నదంతా మన పూర్వీకులు లేదా మన కన్నా రెండు లేదా మూడు తరాలకు పూర్వం వారు అనుభవించలేకపోయారు అంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

ఇటీవలె ప్రపంచం అబ్బురపడేలా అగ్రదేశమైన అమెరికాకు సాధ్యంకాని చంద్రుని దక్షిణ ధృవంపై మన శాస్త్రవేత్తలు చంద్ర మండలంపై చంద్రయాన్- 3 ఉపగ్రహాన్ని దింపి చంద్రునిపై అన్వేషణకు పరిశోధనలు చేయటం మొదలుపెట్టారు. ఇదంత ఒక రాత్రికి రాత్రే జరిగింది కాదు. ఎంతోమంది కొన్ని సంవత్సరాల సమిష్టి కృషికి నిదర్శనం అది. ఇవన్ని మనిషి సాధించిన విజయాలకు చిహ్నాలు మాత్రమే కాని మనిషి అప్పుడప్పుడు ఆదిమ సమాజంలోని లక్షణాలను, మధ్యయుగాలలోని భావజాలాన్ని ప్రదర్శించి సమాజానికి అంతరాయం కల్గించటం ఏమిటి? అనేది ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న. ఇక అసలు విషయంలోకి వస్తే ఈ వ్యాసంలో కొద్దిమందిని వారు పేర్కొన్న వివాదాస్పద విషయాలను ప్రస్తావించదలిచాను ఉదయనిధి స్టాలిన్ ఇటీవల ఓ వేదికలో "సనాతన ధర్మం"పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లోని వ్యక్తిగా, వివాదాస్పదమైన రాజకీయనేతగా వార్తల్లోకి ఎక్కిన ఫలితంగా సాంప్రదాయవాదులందరు తిరుగుబాటు చేసి దేశవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు దిష్టిబొమ్మ దహనాలు చేసి నిరసన వ్యక్తం చేయటం అందరికి తెలిసిన విషయమే. చెన్నైలో ఒక రోజు బంద్ ప్రకటించారు. ఇక రెండవ వ్యక్తి "బైరి నరేష్" గత సంవత్సరము ఓ వేదికలో మాట్లాడుతూ అయ్యప్ప స్వామి గూర్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి అయ్యప్ప స్వాములు దాడిచేస్తే చివరికి అరెస్టై జైలుకి వెళ్ళి, బెయిల్ పై వచ్చిన విషయం అందరికి తెలిసినదే, బైరి నరేష్ వివాదం పెద్ద మొత్తంలో అలజడి సృష్టించింది. ఇక మూడవ వ్యక్తి బి.జే.పి. అధికార ప్రతినిధి "నుపూర్ శర్మ" ఓ టీవి చర్చా వేదికలో

ముహమ్మద్ ప్రవక్త(స)పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అంతర్జాతీయంగా పెద్ద దుమారం రేపాయి, తద్వారా బి.జే.పి. కేంద్ర కమిటీ నుపూర్ శర్మను పార్టీ నుండి సస్పెండ్ చేయటం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత అరబ్ దేశాల నుంచి ఒత్తిడి వచ్చింది. కర్నాటకలోని ఓ విద్యా సంస్థలో రేగిన "హిజాబ్" వివాదం దేశవ్యాప్తంగా సమస్యగా మారి చివరికి సుప్రీంకోర్టు మెట్లెక్కి వివాదం సద్దుమణిగిన విషయం విధితమే. ఇతరుల మతాన్ని గౌరవించని వ్యక్తికి ఇతరులు తన మతాన్ని గౌరవించాలని కోరుకోవటం అవివేకం.

"రెంజర్ల రాజేశ్" చేసిన వివాదాస్పద వ్యాఖ్యల విషయానికొస్తే సరస్వతి దేవి మీద చేసిన ఆరోపణలు అందరికి తెలిసిన విషయమే. రాజేశ్ చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యల వల్ల కూడా పెద్ద మొత్తంలో నిరసనలు కొనసాగాయి. పదిహేను రోజుల పాటు ప్రసార మధ్యమాంలో అదే చర్చ కొనసాగింది బి.జే.పి. మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ ఓ సమావేశంలో ప్రసంగిస్తు ఓ వర్గం వారి ప్రార్ధన స్థలాలను తవ్వండని వ్యాఖ్యానించి పెద్దదుమారం లేపారు. ఇటీవలె జరిగిన శాసన సభ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుండి పోటీచేసి ఓడిపోవడం కొసమెరుపు. ఇక గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ గూర్చి కొత్తగా చెప్పాల్సింది ఏమి లేదు. సమయం వచ్చినప్పుడల్లా వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం వార్తల్లో నిలవటం నిత్యం మనం చూస్తూనే ఉన్నాం, ప్రొటెం స్పీకర్‌గా నియమించబడిన అక్బరుద్దీన్ ఒవైసీ చేత బి.జే.పి. శాసన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయమన్నారు. మరోచోట ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్ నగర్ జిల్లాలో ఓ ఉపాధ్యాయురాలు తరగతి గదిలో ఓ మతానికి సంబంధించిన విద్యార్థిపై మతపరమైన వ్యాఖ్యలు చేసి తోటి విద్యార్థులతో చెంపదెబ్బలు కొట్టించిన ఘటనపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని సదరు ఉపాధ్యాయు రాలు విద్యార్థులకు ఎలాంటి విద్యను నేర్పిస్తున్నారు అని ప్రశ్నిస్తు జరిగిన సంఘటనపై దర్యాప్తు జరిపేందుకు వారంలోగా ఐపియస్ అధికారిని నియమించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం కూడా మనం ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం వుంది. ఇక్కడ మరొక అంశం ప్రస్తావించాలి నిజామబాద్ లో నరేష్ అనే అధ్యాపకుడు పాఠం భోదించే సమయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడన్న కారణంతో బలవంతంగా క్షమాపణ చెప్పించిన సంఘటన కూడా మనం చూశాం.

ఇక ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా పర్సారాలోని సమేయా మన్సూర్ పబ్లిక్ స్కూల్ లో 11వ తరగతి చదువుతున్న విద్యార్థి ఒకరు "ముహమ్మద్ అదాన్" అనే ఉపాధ్యాయుడ్ని "రాంరాం" అంటూ విష్ చేయగా తిరిగి "రాంరాం" అంటూ బదులివ్వని ఆ ఉపాధ్యాయుడు ఇలాంటివి ఎందుకు అంటూ మందలించినందుకు అదికాస్తా మతపరమైన వివాదంగా రాజుకొని కొద్దిమంది పాఠశాల గేటు ముందు ధర్నాచేసి హనుమాన్ చాలీసా పఠించడంతో విషయం ముదురుతుందని గమనించిన పాఠశాల ప్రిన్సిపాల్ సదరు టీచర్‌ను ఉద్యోగం నుండి "డిస్మిస్" చేయటం ఆశ్చర్యకరమైన విషయం. తరగతి గదిలోకి కులాన్ని, మతాన్ని, మూఢనమ్మకాలను, మత విద్వేషాల విషప్రచారాలను, అర్ధం లేని వాదాలను వ్యక్తిగత పైత్యాలను మోసుకొచ్చే వారు తీవ్రవాదుల కంటే అత్యంత ప్రమాదకరం. తరగతి గది సమాజానికి ప్రతిబింబం అలాంటి తరగతి గదిని విషపూరితం చేయాలనుకోవడం అవివేకం అనాలోచిత చర్య కూడా. మన దేశం పటిష్టమైన లౌకిక వ్యవస్థపై ఆధారపడి ఉందన్న ప్రాథమిక విషయాన్ని మరిచి ప్రవర్తించడం అజ్ఞానానికి నిదర్శనం.

మణిపూర్ విషయానికొద్దాం ప్రస్తుతం మణిపూర్ రాష్ట్రంలో ఏం జరుగుతుందో చూద్దాం. "కుకీలు", "మైతేయులు" తెగల మధ్య జరుగుతున్న సంఘర్షణలు సభ్య సమాజానికి తలవంపు తెచ్చేలా వున్నాయ్ మహిళల్ని నగ్నంగా ఊరేగించి అత్యాచారంచేసి చంపిన సంఘటన నాగరిక సమాజం ఏది కూడా క్షమించని పాశవిక చర్య. డెబ్బై ఐదు సంవత్సరాల స్వతంత్ర్య దేశంలో నూతన పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకొని అందులో "మహిళా రిజర్వేషన్ల బిల్లు" ఆమోదించిన వేళ, మణిపూర్ లాంటి సంఘటనలు మహిళల భద్రతను ప్రశ్నార్ధకం చేస్తున్నాయి. చట్ట సభలలో మహిళలకు ప్రవేశం కల్పించినంత మాత్రాన సగటు మహిళకు రక్షణ కల్పించలేని చట్టసభల ప్రాతినిధ్య చట్టం ఎందుకు? చట్ట సభలలో మహిళ ప్రాతినిధ్యం పెరిగినంత మాత్రాన మహిళలపై జరుగుతున్న హింస తగ్గుముఖం పడుతుందా? పురుషుల ధోరణి


తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మారుతుందా? అన్నది ఆలోచించాలి. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా వారిపట్ల జరుగుతున్న నేరాల సంఖ్య పెరుగుతుందే కాని తగ్గకపోవటం ఆందోళన కల్గించే విషయం. ఇక హర్యానా రాష్ట్రంలో జరిగిన దారుణాల గురించి తెలుసు కుందాం ఇటీవలె హర్యానలో జరిగిన మత ఘర్షణలు సభ్య సమాజం తల దించుకునేలా చేశాయి. ఇప్పుడిప్పుడే హర్యానా కోలుకుంటోంది. మూడు నెలల క్రితం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి 15 కి.మీ.ల దూరంలో వున్న చాద్‌నగర్ రోడ్డులో 16 సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసి అర్ధనగ్నంగా రోడ్డుపై అగంతకులు వదిలివేయగా బాధిత బాలిక హృదయవిదారకంగా సహాయం కోసం ఇల్లు ఇల్లు తిరగటం నాగరిక సమాజానికి సిగ్గుచేటు. ఇటీవలే పార్లమెంటులో 128వ రాజ్యంగ సవరణ ద్వారా మహిళలకు చట్ట సభల్లో 33% శాతం ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదింపజేసుకున్న కొద్దిరోజుల వ్యవధిలోనే దేశంలో ఇలాంటి సంఘటన జరగడం దారుణం, ఆలోచించదగిన విషయం కూడా.

మొన్నటి వరకు మండిన మణిపూర్‌లో మళ్ళీ అగ్గి రగులుకుంది ఇటీవలె విద్యార్థులు, పిల్లల్ని చంపిన సంఘటనతో నిప్పు మళ్ళీ రాజుకుంది. ఒక వైపు చైనా చొరబాట్లు, కాశ్మీర్ సరిహద్దులో ఉగ్రవాదుల దాడి, అంతర్గతంగా ఎన్నో సమస్యలు. అసలు ఈ దేశం ఎటుపోతుంది. పాలకులు ఎటువైపు తీసుకొని వెళ్ళాలను కుంటున్నారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. నిజంగా "దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందా"? ఉండబోతుందా? మనం భవిష్యత్తులో ఎలా ఉండబోతున్నాం? అనేది ఇక్కడ మనల్ని మనం తర్కించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక మనకు మన రాజ్యంగం కల్పించిన వెసులుబాట్లు ఒకసారి చూద్దాం, రాజ్యాంగంలోని "19వ నిబంధన" దేశంలోని పౌరులందరికీ "భావ ప్రకటన స్వేచ్ఛ", "వాక్ స్వాతంత్ర్యము"ను కల్పించింది. కాని కొన్ని పరిమితులున్నాయి.

ఓ రాజకీయ పార్టీ నుండి పోటీచేసి ఎన్నికల ద్వారా గెలిచి చట్టసభల్లోకి ప్రవేశించే ముందు "భారత రాజ్యాంగము ద్వారా నిర్మితమైన శాసనము ద్వారా ప్రజాస్వామ్య విలువలను, లౌకిక వ్యవస్థను కాపాడతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అంటూ రాజకీయ ప్రస్తానం ప్రారంభించటం, కానీ ప్రజల భావోద్వేగాలను, మతపరమైన అంశాలైన సున్నిత విషయాలను వివిధ వేదికల ద్వార రెచ్చగొట్టె మాటలు మాట్లాడి ప్రజల మధ్య విభజన రేఖలు గీయటం జరుగుతోంది. రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులకు ఈ మాత్రం తెలియదా? పొరుగు మతాన్ని గౌరవించని వ్యక్తి చట్టసభలలో లేదా చట్టసభలకు ప్రాతినిధ్యం వహించే అర్హత వున్నట్లేనా? రాజ్యాంగ విలువలను, దాని ఆవశ్యకత ఇప్పుడు తప్పనిసరిగా అందరికి తెలియజేసే సమయం ఆసన్నమైంది. కేవలం తరగతి గదిలోనో లేదా సమయం, సందర్భం వచ్చినప్పుడో చదివి విసిరేసే పుస్తకం కాదు అది. మనల్ని మనం పరిపాలించుకోవడానికి ఉపయోగపడే కరదీపిక, మార్గదర్శి. "రాజ్యాంగం"లో అలాంటి గొప్ప విషయాలు అందులో పేర్కొ న్నప్పుడు బాధ్యతారహితంగా మాట్లాడటం తద్వారా దేశంలో అంతర్గతంగా విభజన రేఖలు గీయటం ఇప్పుడు "ఫ్యాషన్ అయింది". లోపం ఎక్కడుంది?

మన విద్య వ్యవస్థలో లోపం ఉందా? బోధించేవారిలో లోపం ఉందా లేదా? మన మెదళ్ళలో లోపం ఉందా? అని ప్రశ్నించు కోవాలి ఒకసారి. ఎప్పుడో బ్రిటిష్ వాడు ప్రయోగించిన "విభజన" మంత్రం ఒంట బట్టించుకొని నేటికి వదలకపోవడం భవిష్యత్ తరాలకి విషం ఎక్కించటం లాంటిదే. తరగతి గదులు విద్యార్థి జీవితానికి బాటలు వేసే వేదికలు కావాలి కాని పాఠాలు బోధించే వారే "కులం" పేరుతో, "మతం" పేరుతో వివక్షను ప్రదర్శిస్తే ఎంతమంది "అంబేడ్కర్లు" అలాంటి తరగతి గదుల నుండి పుట్టుకొస్తరు.

ఈ సంఘర్షణను నివారించే పాలకులు రానప్పుడు, పైగా మత రాజకీయాలు చేసే శక్తులు వున్నప్పుడు దేశం సుభిక్షంగా, శాంతియుతంగా ఎలా ఉండగల్గుతుంది, ఈ విభజన రేఖలు ఇలానే కొనసాగితే భవిష్యత్తులో ఒకరిపై మరొకరు కత్తులు దూసుకొని రక్తపాతం సృష్టించుకొని సాధించేదేమిటి? సంకుచితపు భావజాలాన్ని ప్రచారం చేసే ఎలాంటి వ్యక్తులనైనా, వారు ఎలాంటి స్థానంలో వున్నా నిరోధించకపోతే భవిష్యత్ తరాలు ఖచ్చితంగా ప్రమాదంలో పడ్తాయి ఇది ముమ్మాటికి నిజం.

"లౌకిక" వ్యవస్థను కాపాడే ప్రయత్నం అందరం కల్సికట్టుగా చేసినప్పుడే అన్నదమ్ములవలె అందరం కల్సి ఉండగలం.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# పరీక్ష!

- షేక్ అబ్దుల్ బాసిత్

ప్రతి తల్లి తండ్రి సాధ్యం అయినంత వరకు తమ సంతానాన్ని సుఖ సంతోషాలతో ఉంచాలని శాయశక్తులా ప్రయత్నిస్తారు. అందు కోసం ధర్మాధర్మాల విచక్షణ కూడా కొందరు మరచి పోతారు. తమ తదనంతరం తమ పిల్లలు ఎవరి మీదా ఆధార పడరాదని, ఎవరి ముందు చేతులు చాచరాదని వీలైనంతగా సంపాదించి పెట్టడానికి ప్రయత్నం చేస్తారు. మరి కొందరు రేయనక పగలనక కష్టపడి పెద్ద పెద్ద చదువులు చదివిస్తారు. ఇంకొందరు మంచి విద్యా బుద్ధులతో పాటు కష్టపడి జీవించడం ఎలాగో నేర్పుతారు.

సృష్టిలోని మిగతా జీవరాశులు కూడా తమ సంతానాన్ని మనకంటే ఎక్కువ ప్రేమతో పెంచుతాయి.

తమ సంతానానికి ఈ భూమి మీద ఎలా జీవించాలో శిక్షణ ఇస్తాయి.

మనలా కూడబెట్టి ఇవ్వవు. సోంబేరులుగా, సోమరిపోతులు బతకడం నేర్పవు.

ఇస్లాం ఈ విషయంలో చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

సంతానం దేవుని వరం.

ఈ జీవితం శాశ్వతం కాదు. ఇది అందరికీ తెలిసిన జీవిత సత్యం. శాశ్వతమైన జీవితం మరణానంతరం జీవితం.

ఆ శాశ్వతమైన జీవితం కోసం ఈ జీవితం ఒక పరీక్ష. ఆ పరీక్షలో ఎలా గెలుస్తావో చూడడానికి దైవం మనకు సంతానాన్ని ఇచ్చాడు. ఖురాన్‌లో చాలా స్పష్టంగా ఇలా చెప్పబడింది.

మేము మానవుణ్ణి శ్రమకోసం పుట్టించాం. (90:4)

అంటే, ఈ ప్రపంచం, భోగభాగ్యాలు అనుభవిస్తూ హాయిగా జీవించే స్థలం కాదు కష్టాలు, కాఠిన్యాలు, శ్రమతో నిండిన స్థానం ఇది. ఏ మనిషైనా ఈ స్థితిగతులకు లోనుకాకుండా ఉండలేడు.

అందుకే అల్లాహ్‌ను, అంతిమ దినాన జవాబుదారీతనాన్ని విశ్వసించే వారు తమ సంతానాన్ని సుఖభోగలాలాసాలకు బానిసగా జీవించేలా శిక్షణ ఇవ్వకూడదు. చిన్నప్పటి నుంచే ప్రతి విషయాన్ని ధైర్యంగా ఎదుర్కొని నిలబడేలా పెంచాలి. తమ పని తాము చేసుకుని బతకడం నేర్పాలి.

నిజమైన విశ్వాసులు తమ సంతానానికి ఇచ్చే అసలైన ఆస్తులు శ్రమ, స్థైర్యం, పరలోక జవాబుదారీతనానికి సిద్ధంగా ఉండటం.

మీరు కూడబెట్టి ఇస్తున్న ఆస్తులు అంతస్తులు, బ్యాంకు బ్యాలెన్స్‌లు అని ఇక్కడ వదిలి వెళ్ళేవే.

మా నాన్న ఇంకా కొన్ని క్షణాల్లో ఈ లోకాన్ని వీడి వెళ్తాడు అనగా నాకు ఇచ్చిన ఆస్తి విలువ ఎంతో తెలుసా?

బహుశా చాలా కొద్ది మందికి మాత్రమే ఇంత ఆస్తి వారసత్వంగా లభించి ఉంటుంది. అదేంటో తెలిస్తే ఎవరికైనా ఈర్ష్య కలుగక మానదు.

కానీ నేనే దురదృష్టవంతుడిని ఆ ఆస్తి విలువను తెలుసుకోలేక పోయాను. దాన్ని అర్థం చేసుకుని ఉపయోగించుకోలేక పోయాను.

ఇంతకు ఆ ఆస్తి ఏమిటి? ఆసక్తి కలుగుతుంది కాదు?

అది రంజాన్ మాసం. ఏడు ఉపవాసాలు పూర్తి అయ్యాయి. ఎనిమిదో ఉపవాసం మొదలైంది. అసర్ నమాజ్ నుంచి టైం ఎంతైందో చెప్పండి. నేను వెళ్ళే విమానం వస్తుంది అని అంటున్నాడు. మేము టైం చెబుతుంటే, మీరు సరిగా చెప్పడం లేదు. నా వాచీ ఇవ్వండి అని వాచీ పెట్టుకున్నారు. బిగ్గరగా కలిమా తయ్యెబా, సురే ఫాతిహ, సురే ఇఖ్ లాస్ చదివారు. ఆ తరువాత సురే అస్ర్, "కాలం సాక్షిగా మానవుడు నిస్సందేహంగా నష్టంలో పడి ఉన్నాడు. విశ్వసించి మంచి పనులు చేసి, ఒకరికొకరు సత్యోపదేశం, సహనంబోధ చేసుకునేవారు తప్ప." అని చదువుతూ ఈ లోకాన్ని వీడి వెళ్ళిపోయారు.

"ఇన్నలిల్లాహి వ ఇన్నాఇలైహి రాజీవున్"

ప్రాపంచిక నష్టం నుంచి తప్పించుకుని, పరలోక శాశ్వత జీవితంలో అంతులేని సుఖాలు పొందే ఆస్తి అప్పగించి వెళ్ళి పోయారు మా నాన్న.

ఇంత కన్నా పెద్ద ఆస్తి ఇంకేముంటుంది చెప్పండి. సృష్టికర్త అయిన అల్లాహ్ మనందరినీ హెచ్చరిక జారీచేసిన మన ఏమరుపాటులో పడి ఉన్నాం.

మరణానంతరం పరలోకంలో వజ్రవైడుర్యాల ఇటుకలతో నిర్మించిన ఇల్లు, మన ఊహకు కూడా అందని అతిలోక సౌందర్యవతి అయిన భార్య, కష్టపడకుండా కావాల్సిన ప్రతిదీ అనుభవించే సౌకర్యాలు లంబించే వైపు పరుగులు తీయకుండా, అన్ని వదలి వెళ్లే ప్రాపంచిక భోగభాగ్యాల వెనుక పరుగులు తీస్తున్నాం.

మనం మన సంతానాన్ని భగభగ మండే అగ్నికి ఆహుతి అయ్యే దిశలో పయనిస్తున్నాం.

# ఇహలోక జీవితం!
# పరలోక జీవితం!!

- ముహమ్మద్ వహీదుద్దీన్

**ఇహలోకం** తాత్కాలికమైనది. మన అసలు జీవితం మరణానంతరమే మొదలవుతుంది. అదే పరలోక జీవితం, పరలోక సాఫల్య,వైఫల్యాలు ఇహలోకంలో మనం ఆచరించే కర్మల్నిబట్టే ఉంటాయి. పరలోక సాఫల్యం పొందడానికి ఇహలోకంలోనే పాటుపడటం బుద్ధిమంతుని లక్షణం.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "ఇహలోకంలో మీకివ్వబడిన జీవన సామగ్రి మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. దేవుని దగ్గర ఉన్నదే శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. అయితే సత్యాన్ని విశ్వసించి తమ ప్రభువును నమ్ముకునే వారికే ఇది లభిస్తుంది." (అష్షూరా 42: 36)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : "మీరు సముద్రంలో వేలు ముంచి తీస్తే దానికి ఎంత నీరు అంటుతుందో పరలోక జీవితం ముందు ఇహలోక జీవితం కూడా అంతే! (ముస్లిమ్)

దేవుని దృష్టిలో ఈ లోకానికి దోమ రెక్కంత విలువున్నా ఆయన అవిశ్వాసులకు గ్రుక్కెడు నీళ్ళు కూడా తాగించేవాడు కాదు. (తిర్మిజీ)

ఒకసారి దైవప్రవక్త(స) ఓ బజారున వెళుతున్నారు. ఆయన ఇరుపక్కలా జనం ఉన్నారు. అలా వెళుతూ ఆయన పొట్టి చెవులు గల ఒక చచ్చిన మేక పిల్లను చూశారు. దాని చెవి పట్టుకొని అక్కడున్నవారితో "మీలో ఎవరైనా దీన్ని ఒక దిర్హంకైనా కొనడానికి ఇష్టపడతారా?" అని అడిగారు. దానికి వారు '(ఒక దిర్హం కాదు కదా) దానికన్నా తక్కువ ఖరీదు కూడా మేము దాన్ని తీసుకోము. ఒకవేళ తీసుకున్నా దాన్ని మేమేం చేసుకుంటాం?" అని అన్నారు. 'ఒకవేళ ఉచితంగా లభిస్తే తీసుకోవడానికి ఇష్టపడతారా?' అని మళ్ళీ అడిగారు దైవప్రవక్త(స). దానికి వారు "దైవసాక్షి! ఇది బ్రతికున్నా దీనిలో లోపం ఉంది. దీని చెవులు పొట్టిగా ఉన్నాయి. అయినా చచ్చిపోయిన దాన్ని మేము ఏం చేసుకుంటాం?"అని అన్నారు. అప్పుడు ఆయన 'దైవసాక్షి! మీరు ఈ మేకపిల్లను ఎంత తుచ్ఛమైనదిగా భావిస్తున్నారో దేవుని దృష్టిలో ఈ లోకం అంతకన్నా తుచ్ఛమైనది" అని చెప్పారు. (ముస్లిమ్)

దైవప్రవక్త(స) ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) భుజం మీద చెయ్యి వేసి ఇలా తెలిపారు : "ప్రపంచంలో నువ్వు ఒక అపరిచిత వ్యక్తిలా, బాటసారిలా జీవితం గడుపు. సాయంత్రం గడిపిన తరువాత ఉదయం కోసం ఎదరు చూడకు. ఉదయం గడిపిన తరువాత సాయంత్రం కోసం ఎదురు చూడకు. వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, మరణానికి పూర్వం జీవితాన్ని మహా భాగ్యాలుగా భావించు." (బుఖారీ)

"ప్రపంచాన్ని ప్రేమించేవాడు తన పరలోకాన్ని నాశనం చేసుకుంటాడు, పరలోకాన్ని ప్రేమించేవాడు తన ప్రపంచాన్ని నష్టపరుచుకుంటాడు. కనుక ప్రజలారా! మీరు అంతమైపోయే

# అబాబీలు

అయూబ్ బాషా,
నంద్యాల

మాతృదేవోభవ అన్న దేశంలో
స్త్రీని వివస్త్రను చేసి ఊరేగిస్తున్నారు
ఎలుకకు కూడా రక్షణ లభించే దేశంలో
"అయ్యాబు"
మనుషుల్ని నిర్దాక్షిణ్యంగా భక్షిస్తున్నారు

దైవ గ్రంథాలు చదవలేని వారు
భక్తి ప్రవచనాలు వల్లిస్తున్నారు
ధర్మం అంటే అవగాహన లేనివారు
"అయ్యాబు"
ధర్మరక్షణ పేరిట అలజడి సృష్టిస్తున్నారు

ప్రణాళికాబద్ధ రచనతో సూత్రధారులు
పరకాయ ప్రవేశం చేస్తున్న పాత్రధారులు
అంతా గమనిస్తున్నాయి మేధావి వర్గాలు
"అయ్యాబు"
ఇకముందు పారబోవు శకుని పాచికలు

నిర్మాణాత్మక చర్యలు చేయలేనివారు
విచ్ఛిన్నకర పరిస్థితికి తెర తీస్తారు
భావోద్వేగాలతో అగ్నికి ఆజ్యం పోస్తారు
"అయ్యాబు"
భుక్తికోసం అమాయకులే బలౌతారు

మోస్తున్నట్టు నటిస్తున్న గార్దభం
దాని ఐచ్ఛికమే ప్రతీ నిర్ణయం
ప్రశ్నించే వారి హక్కులు హననం
"అయ్యాబు"
గార్దభం భారాన్ని గుర్రానికి అప్పగిద్దాం

చూస్తుంటే సీరియళ్ళ తీరుతెన్నులు
కొన్ని కుటుంబాల్లో రావొచ్చు చీలికలు
మనుషుల్లో మార్పు రానంతవరకు
"అయ్యాబు"
కొనసాగుతూనే ఉంటాయి "ధారా"వాహికలు

నాటి సినిమా కుటుంబ విలువల సమహారం
నేటి సినిమా విద్వేష కర అశ్లీలతల వ్యాపారం
సమాజానికి సందేశాన్ని ఇచ్చేవి మృగ్యం
"అయ్యాబు"
యువతను దిశా నిర్దేశం చెయ్యాలి అందరం

చిన్ని తెరలకు సీరియళ్లు పెద్ద వరం
బీభత్స, భయానక రౌద్రరసాల మయం
కలహ కల్లోలాల కలవర కథల సమాహారం
"అయ్యాబు"
కుటుంబ విలువలు కాపాడేవి మృగ్యం

(ఐహిక) జీవితం కంటే శాశ్వతంగా ఉండే (పరలోక) జీవితానికి, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వండి.'' (మిష్కాత్)

''ఈ ప్రపంచం మధురమైనది, సస్యశ్యామలమైనది. నిజానికి దేవుడు మిమ్మల్ని ఈ ప్రపంచంలో తన ప్రతినిధులుగా పుట్టించి, మీరు ఎలా పని చేస్తారోనని పరీక్షిస్తున్నారు. కనుక మీకు ప్రాపంచిక (మాయల) విషయంలో, స్త్రీల (ద్వారా ఎదురయ్యే పరీక్షల) విషయంలో అప్రమత్తంగా ఉండండి.'' (ముస్లిమ్)

హజ్రత్ అమ్ర్ బిన్ ఔఫ్ అన్సారీ(రజి) కథనం: దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు : ''దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్న భయం నాకు లేదు. కాని గత సమాజాలకు మాదిరిగా మీక్కూడా పుష్కలంగా ప్రాపంచిక సిరిసంపదలు లభిస్తే మీరూ వారిలాగే ప్రాపంచిక వ్యామోహంలో పోటీ పడతారేమోనని నాకు భయంగా ఉంది. అలా చేస్తే ఈ ప్రాపంచిక వ్యామోహం గత సమాజాలను నాశనం చేసినట్లు మిమ్మల్ని కూడా నాశనం చేయవచ్చు.'' (బుఖారీ, ముస్లిమ్)

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# కశ్మీర్‌పై సుప్రీం తీర్పు




**ఆర్టికల్ 370**పై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు రాష్ట్రాల అధికారాలు, స్వేచ్ఛలు, ఫెడరలిజంపై ప్రశ్నలు లేవదీస్తోందని పలువురు విశ్లేషకులు అంటున్నారు. కోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో అధికార బిజెపికి రాజకీయ విజయం లభించింది. మరోవైపు ఫెడరల్ సూత్రాలను దెబ్బతీసే అవకాశాలు కల్పించిందని అంటున్నారు.

2019 ఆగస్టు 5న ఒక రాజ్యాంగ ఉత్తర్వుతో ఇదంతా ప్రారంభమైంది. జమ్మూ కాశ్మీర్ కు సంబంధించిన కీలకమైన నిర్వచనాలను మార్చివేయడం జరిగింది. ఇలాంటి నిర్ణయాలు తీసుకోడానికి తప్పనిసరిగా రాష్ట్ర శాసనసభ సిఫారసు అవసరమనే నియమాన్ని పక్కన పెట్టడం జరిగింది. ఎందుకంటే శాసనసభ రద్దయిఉంది కాబట్టి. ఆర్టికల్ 370 అమలులో లేదని ప్రకటించిన ఒక నోటిఫికేషన్‌లో ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్రపతికి ఉందని పేర్కొనడం జరిగింది. ఇది జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాను తొలగించడమే కాకుండా దానిని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది.

2023 డిసెంబర్ 11న ఇచ్చిన కోర్టు తీర్పు, ఆగస్టు 5 ఉత్తర్వులోని కొన్ని భాగాలను రాజ్యాంగ విరుద్ధమని భావించినప్పటికీ విచిత్రంగా ఈ ఉత్తర్వు ద్వారా తీసుకున్న చర్యలను సమర్థించింది. ఈ వైరుధ్యం ఆందోళన కలిగిస్తుంది. దీనివల్ల వాటిల్లే పరిణామాలేమిటంటే, ఒకటి, పార్లమెంటు ద్వారా రాష్ట్రపతి పాలన విధించి ఒక రాష్ట్రం కోలుకోలేని విధంగా వ్యవహరించే అవకాశాన్ని ఈ రాజ్యాంగ వివరణ ఇస్తోంది. ఇది ఒక అవాంఛనీయ ఉదాహరణగా మారుతుంది. రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల సమ్మతి లేకుండా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం భారీ మార్పులు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది.

అంతేకాకుండా, 1957లో రాజ్యాంగ సభ రద్దు అయిన తరువాత జమ్మూ కాశ్మీర్‌కు రాజ్యాంగం క్రమంగా వర్తింపజేయబడిందని, ఇప్పుడు ప్రత్యేక హోదాను తొలగించడంతో అది ముగిసిందని కోర్టు పేర్కొన్న విషయాల్లో ప్రాథమికంగా జమ్మూ కాశ్మీర్ భారత దేశంలో చేరడానికి ఇచ్చిన చారిత్రక హామీలను విస్మరించడం జరిగింది. ఇది Instrument of accession, ఆ తరువాత జరిగిన చర్చలను విస్మరిస్తుంది, చారిత్రక ఒప్పందంలోని నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా మార్చే అవకాశాలు కల్పిస్తోందని విమర్శకులు అంటున్నారు.

జమ్మూ కాశ్మీరును రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించడానికి రాజ్యాంగం అనుమతిస్తుందా అనే విషయాన్ని తీర్పు దాట వేసింది. దీనివల్ల మొత్తం ప్రక్రియ చట్టబద్ధత ప్రశ్నార్థమవుతోంది. ఈ విషయాన్ని దాటవేయడానికి ప్రస్తావించిన ఒకే ఒక్క సమర్థన ఏమిటంటే, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని సొలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీ. ఈ హామీకి రాజ్యాంగ న్యాయ ప్రక్రియలో ప్రాముఖ్యం ఉందా? అని వ్యాఖ్యాతలు ప్రశ్నిస్తున్నారు.

లద్దాక్‌ను ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడాన్ని సమర్థించడం ద్వారా ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల నుండి కొత్త కేంద్రపాలిత ప్రాంతాలు కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాన్ని కల్పించింది. ఇది అనేక రాజకీయ పునర్వ్యవస్థీకరణ నిర్ణయాలకు దారితీయవచ్చు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకునే అధికారాలను రాష్ట్రపతికి, పార్లమెంటుకు ఈ తీర్పు కట్టబెడుతోంది. ఇది రాష్ట్రాల స్వేచ్ఛలు, అధికారాలు, రాష్ట్ర శాసనసభల పాత్రలను కుదించడమే అవుతుంది.

జమ్మూ కాశ్మీర్‌పై భారత సార్వభౌమత్వాన్ని ఈ తీర్పు బలపరిచింది. కాని కేంద్రం అధికారాలపై సంస్థాగత నిబంధనలను బలహీనపపరుస్తోంది. ఇవి ఫెడరలిజానికి ఎంతో అవసరమైన నిబంధనలు. రాష్ట్రంలో ఎన్నికైన ప్రభుత్వ అభిప్రాయాలకు విరుద్ధంగా కేంద్రం రాష్ట్రపతి పాలన ద్వారా తన ఇష్టానుసారం వ్యవహరించే అవకాశాన్ని కలిగిస్తోంది. రాజ్యాంగ సవరణలు, అంతర్-రాష్ట్ర ఒప్పందాలను రద్దు చేయడం లేదా రాష్ట్ర సమ్మతి లేకుండా ప్రధాన విధాన మార్పులను అమలు చేయడం వంటి అనేక సమస్యలు దీనివల్ల ఉత్పన్నం కావచ్చు.

ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాను సవాలు చేయడమే కాదు, భారత ఫెడరల్ స్ఫూర్తికి కూడా విరుద్ధమైనదని, ప్రాంతీయంగా రాష్ట్రాల అధికారాల కన్నా కేంద్రం అధికారాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితిని సృష్టించిందని, దేశంలో రాష్ట్రాలకు స్వంత అధికారాలు, స్వేచ్ఛలు చాలా పరిమితమనే సందేశం ఇందులో ఉందని పలువురు భావిస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం కేంద్రం, రాష్ట్రాల అధికారల సమతుల్యతను కాపాడుకుంటూ వచ్చిన సంప్రదాయాలను ఇది నీరుగారుస్తోందంటున్నారు. ❖

## 'స్వదేశీ' ముస్లిం జనాభా గణన చేస్తానంటున్న అస్సాం - ముస్లిములను వేధించే సరికొత్త ప్రయత్నం

**అస్సాం** ప్రభుత్వం రాష్ట్రంలో "స్వదేశీ ముస్లిం" జనాభా గణన చేస్తామంటోంది. ఇది అత్యంత వివాదాస్పద నిర్ణయాలలో ఒకటి. అస్సాంలో ఐదు తెగలను 'స్వదేశీ అస్సామీ ముస్లింలు'గా గతంలో గుర్తించారు. ఈ గుర్తింపు జరిగిన ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు స్వదేశీ ముస్లిం జనాభా గణన చేస్తామంటున్నారు. మైనారిటీ వ్యవహారాలు, చార్ ప్రాంతాల డైరెక్టరేట్ ఈ సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తుంది. అస్సాం జనాభాలో ముస్లిములు 34% కన్నా ఎక్కువగా ఉన్నారు. ఈ ఐదు తెగలు కాని ఇతర ముస్లిములందరూ స్వదేశీ అస్సామీ ముస్లిములు అనే కేటగిరిలోకి రారు. అంటే అర్థమేమిటి? వారు విదేశీయులని తర్వాత తీర్మానిస్తారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేకంగా అస్సామీ మాట్లాడే స్థానిక ముస్లింలను గుర్తించి, వారిని బెంగాలీ మాట్లాడే ముస్లింల నుండి వేరు చేయడానికి ఉద్దేశించిన చర్య ఇది. బెంగాలీ మాట్లాడేవారిని పొరుగు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన ముస్లింలుగా చూడడం జరగదు, వారిని బంగ్లాదేశ్ నుండి వచ్చిన అక్రమ ముస్లిం వలసదారులుగా వేధించడం జరుగుతోంది. రాష్ట్రంలో మతపరమైన ఉద్రిక్తత, మతపరమైన వేర్పాటును మరింత రెచ్చగొట్టే చర్యగా దీన్ని పలువురు విమర్శిస్తున్నారు.

ఇలాంటి జనాభా గణన భారతదేశంలో గతంలో జరగలేదు. ఒక రాష్ట్రంలోని నిర్దిష్ట మత సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని, అందులో స్వదేశీయులు ఎవరు? విదేశీయులు ఎవరన్న జనాభా గణన ప్రపంచంలో ఎక్కడైనా జరిగిందా? ఇలాంటి సర్వే స్వదేశీ హిందూ లాంటిది లేదా ఇతర వర్గాలకు సంబంధించింది ఏదీ జరగడం లేదు. కేవలం ముస్లిములను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారు.

ఈ జనాభా గణన స్థానిక ముస్లింలకు సంక్షేమ పథకాలను విస్తరించడానికి ఉద్దేశించినదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ చాలా మంది ప్రభుత్వం మాటలు నమ్మడం లేదు. గత ఐదేళ్లలో అస్సాం ప్రభుత్వ చర్యలు, ప్రకటనలు ముస్లిం సమాజం పట్ల పూర్తిగా వివక్ష పూరితమైనవిగా, విద్వేషంతో కూడుకున్నవిగా కనిపిస్తున్నాయని పలువురు అంటున్నారు. వివాదాస్పద ఎన్నార్సీ అమలు చేయడం, వివక్షతతో కూడిన పౌరసత్వ సవరణ చట్టం, వందలాది పేద ముస్లిం నివాసాలను కూల్చివేయడం వంటి చర్యలతో అస్సాం ప్రభుత్వం ముస్లిం వ్యతిరేక ప్రభుత్వంగా గుర్తింపు పొందింది. మదరసాలపై, జనాభా నియంత్రణపై ముఖ్యమంత్రి హేమంతా బిశ్వ శర్మ చేసిన ప్రకటనలు ప్రభుత్వ ముస్లిం వ్యతిరేకతకు నిదర్శనాలుగా ఉన్నాయి.

ఈ జనాభా గణన ముస్లిములను వేధించడానికి ఉపయోగిస్తారని చాలా మంది సామాజిక కార్యకర్తలు భయపడుతున్నారు. స్వదేశీ కాని ముస్లింలని ముద్రవేసి ముస్లిములను వేధించడానికి ఒక ఆయుధంగా ఈ జనాభా గణనను ఉపయోగిస్తారన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ డేటాను దుర్వినియోగం చేస్తారని పలువురు వాదిస్తున్నారు. ఈ డేటా ఎన్నికల రాజకీయాలను, విధాన నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

ముస్లిం సమాజాన్ని భాషా ప్రాతిపదికన విభజించడానికి ఈ డాటాను ఉపయోగిస్తారని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అస్సామీ-మాట్లాడే స్థానిక ముస్లింలు, బెంగాలీ-మాట్లాడే ముస్లింల మధ్య వ్యత్యాసం ఇప్పటికే ఉన్న సామాజిక విభజనలను మరింత పెంచుతుంది. ఇది లౌకికస్ఫూర్తికి విరుద్ధమైనది.

# మళ్లీ ఈవీఎం రగడ



**డిసెంబర్ 3న** వివిధ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాల విశ్వసనీయతపై మరోసారి వివాదం రాజుకుంది. మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఊహించని విజయం తర్వాత ఈవీఎంల విశ్వసనీయత ప్రశ్నార్థకమయ్యింది. ప్రతిపక్ష నేతలు ఈవీయంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబర్ 4న, ఫలితాలు వెలువడిన ఒక రోజు తర్వాత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ "బిజెపికి అనుకూలంగా వచ్చిన ఆశ్చర్యకరమైన ఎన్నికల ఫలితాలు ఈవీఎం పనితీరుపై ఆందోళన కలిగిస్తున్నాయి. సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతున్నాం" అని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత దిగ్భ్రాంతికి గురైన చాలా మంది మనోభావాలను రాహుల్ గాంధీ మాటలు ప్రతిధ్వనిస్తున్నాయని పలువురు భావిస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు సర్వేలు గట్టి పోటీని సూచించిన రాష్ట్రాల్లో ఫలితాలు తారుమారయ్యాయి.

తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మమతా బెనర్జీ డిసెంబర్ 5న తన అనుమానాలు వ్యక్తం చేశారు. "మన ఎన్నికల ప్రక్రియ ప్రమాదంలో ఉంది. ఈ రాష్ట్రాల్లో ఊహించని విధంగా బీజేపీ సాధించిన ఘన విజయంపై అనుమానాలున్నాయని" అన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన అరవింద్ కేజ్రీవాల్ డిసెంబర్ 6న మాట్లాడుతూ, "ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశాన్ని కాదనలేము. ప్రజల అసమ్మతి ఉన్నప్పటికీ, బిజెపికి అనుకూలంగా ఫలితాలు రావడం ఆందోళనకరంగా ఉంది" అని అన్నారు.

ఈ ఫలితాలు ఈవీఎంల విశ్వసనీయతపై తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈవీయంలను తారుమారు చేసే అవకాశం ఉందని, ఆవిధంగా భారత ప్రజాస్వామ్య పునాదిని బలహీన పరుస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు.

ఈ ఆరోపణలకు ప్రతిస్పందనగా, బిజెపి నాయకులు ఎదురు ప్రశ్నలు అడుగుతున్నారు. బిజెపి గెలిచినప్పుడు మాత్రమే ఈవీఎంల గురించి ఈ సందేహాలు ఎందుకు? అంటూ కర్ణాటక ఎన్నికలను ఉదహరిస్తున్నారు. అక్కడ బిజెపి ఓటమిని ఎదుర్కొంది, అయినప్పటికీ అప్పుడు ఈవీఎంల గురించి ఎటువంటి ప్రశ్నలు ఎవరు అడగలేదని బీజేపీ నేతలు వాదిస్తున్నారు.

దీనికి జవాబుగా ప్రతిపక్ష నాయకులు ఎదురుదాడి చేస్తున్నారు. అసలు సమస్య ఈవీఎంలు యాదృచ్ఛికంగా పని చేయకపోవడం గురించి కాదని, ఈ యంత్రాలను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేశారని ఆరోపిస్తున్నారు. "ఈవీఎంలలో అంతర్గత లోపం ఉంటే, అవి ఎక్కడైనా పని చేయకపోవచ్చు. కానీ ఈవీఎంలను తారుమారు చేస్తున్నారని" కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు అన్నారు.

ఈవీఎంల విశ్వసనీయత, ట్యాంపర్ ప్రూఫ్ స్వభావం గురించి భారత ఎన్నికల సంఘం ప్రజలకు పదేపదే హామీ ఇచ్చింది. కానీ ఇటీవలి వివాదాలు ఈ హామీలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మళ్ళీ పేపర్ బ్యాలెట్లు అమలు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఇటీవలి ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబించడం లేదా? ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ ఎలాంటివి అలాగే ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలు లేకుండా సజావుగా సాగడం చాలా ముఖ్యం, ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే, పారదర్శకంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది ❖



# గోరఖ్‌పూర్ డాక్టర్ కఫీల్‌ఖాన్‌పై మరో కేసు

**గోరఖ్‌పూర్** ఆసుపత్రిలో 2017లో తీవ్రవిషాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో ఆక్సిజన్ లేక అలమటిస్తున్న పసిపిల్లలను కాపాడ్డానికి అలుపెరుగక ప్రయత్నాలు చేసిన పీడియాట్రిషియన్ డాక్టర్ కఫీల్‌ఖాన్ కథ అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆయన్ను మరోసారి చట్టపరమైన ఇబ్బందుల్లో ఇరికించారు. ఈసారి బిజెపి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఆయన రాసిన పుస్తకంలో విమర్శలున్నాయని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆయనపై కేసు నమోదు చేసింది.

డాక్టర్ ఖాన్ 2017లో గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్ దాస్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా ఆగిపోయినప్పుడు తక్షణం స్పందించి, అనేకమంది పసిపిల్లలను కాపాడి హీరోగా ప్రశంసలు అందుకున్నారు. ఆసుపత్రి తీవ్రమైన ఆక్సిజన్ కొరత వల్ల అనేక మంది పిల్లలు మరణించారు కూడా. పీడియాట్రిక్స్ విభాగంలో జూనియర్ డాక్టర్ అయిన డాక్టర్ ఖాన్ తన స్వంత ఖర్చుతో ఆక్సిజన్ కొనుగోలు చేసి పిల్లలను సాధ్యమైనంత వరకు కాపాడారు.

కాని తర్వాత డా. ఖాన్‌పైనే యోగీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ఆక్సిజన్ కొరత కారణంగా మరణాలకు కారణమయ్యారని డాక్టర్ ఖాన్‌తో పాటు మరో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 2018లో దర్యాప్తు బృందం నిర్దోషిగా ప్రకటించే వరకు ఆయన ఏడు నెలలు జైలులో గడిపాడు.

ఆయన నిర్దోషిగా తేలినప్పటికీ, డాక్టర్ ఖాన్‌పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కక్ష కట్టింది. బహ్రాయిచ్ జిల్లాలోని ఒక ఆసుపత్రిలో గందరగోళం సృష్టించారని 2018లో అతన్ని మళ్లీ అరెస్టు చేశారు, ఈ ఆరోపణను అతను ఖండిస్తూ, ఎన్సెఫాలిటిస్ కారణంగా పిల్లల మరణాల గురించి విచారించడానికి అక్కడికి వచ్చానని పేర్కొన్నాడు. అతన్ని పదేపదే అరెస్టు చేయడం చూస్తుంటే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టంగా అర్థమవుతూనే ఉంది.

డాక్టర్ ఖాన్‌పై తాజా కేసు అతను రాసిన పుస్తకం కారణంగా అతన్ని ఇరికించిన కేసుగా చాలామంది భావిస్తున్నారు. డాక్టరుగా తన అనుభవాలు, గోరఖ్‌పూర్ ఆసుపత్రి విషాదం సమయంలో తాను ఎదుర్కొన్న సవాళ్లను ఆయన పుస్తకంలో రాశారు. ఒక స్థానిక వ్యాపారవేత్త ఈ పుస్తకం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని విమర్శిస్తోందని కేసు పెట్టాడు. బిజెపి ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఈ పుస్తకం రాశారని ఆరోపించాడు. డాక్టర్ ఖాన్‌పై మోసం, ఫోర్జరీ, మత సామరస్యాన్ని రెచ్చగొట్టడం వంటి ఆరోపణలతో కేసు నమోదు చేశారు.

ఈ కొత్త పరిణామంతో భారతదేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి చర్చ మరోసారి తీవ్రమయ్యింది. డాక్టర్ ఖాన్‌పై కేసు విమర్శకుల గొంతు నొక్కడానికి, ప్రభుత్వం పట్ల అసమ్మతి వెలిబుచ్చేవారిని బెదిరించే ప్రయత్నం అని విమర్శకులు వాదిస్తున్నారు. డాక్టర్ ఖాన్ మద్దతుదారులు ఈ కేసును ప్రభుత్వం వేధింపులకు మరో ఉదాహరణగా చెబుతున్నారు.

డాక్టర్ ఖాన్ కథ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక వ్యక్తిగత వైద్యుడి పోరాటం గురించి మాత్రమే కాదు, భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ, జవాబుదారీతనం, భావ ప్రకటనా స్వేచ్ఛల పరిస్థితిని తెలియజేస్తోంది. ఆయన చేసిన చట్టపరమైన పోరాటాలు, ఆయన పుస్తకంపై ప్రభుత్వ ప్రతిస్పందన, అధికారులకు వ్యతిరేకంగా మాట్లాడే వారు ఎదుర్కొంటున్న సవాళ్లు దీనివల్ల తెలుస్తున్నాయి. ●

# ముస్లిములను విలన్లుగా చిత్రీకరించడానికి గాజా యుద్ధాన్ని వాడుకుంటున్న మతతత్వ శక్తులు

## - వాషింగ్టన్ పోస్టు పత్రికలు విశ్లేషణాత్మక వ్యాసం

"భారతదేశంలో పాలక పార్టీ ముస్లింలను విలన్లుగా చిత్రీకరించడానికి ఇజ్రాయెల్-గాజా యుద్ధాన్ని ఉపయోగిస్తోంది" అనే శీర్షికతో వాషింగ్టన్ పోస్ట్ రాసిన వ్యాసం ఇజ్రాయెల్-గాజా వివాదంలో భారతీయ జనతా పార్టీ వైఖరి, భారతదేశంలో ముస్లిం జనాభాపై ఈ వైఖరి వల్ల పడే ప్రభావాల గురించి విమర్శనాత్మక విశ్లేషణను అందించింది.


అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పై హమాస్ దాడిని 2014లో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఎన్నిక కావడానికి ముందు భారతదేశంలో పరిస్థితితో పోల్చుతూ బీజేపీ ప్రచారం మొదలుపెట్టింది. గతంలో జరిగిన ఉగ్రవాద దాడి వీడియో జత చేసి బీజేపీ ట్వీట్ చేసి దేశంలో ఇస్లామిక్ టెర్రరిజం గురించి చేసిన ఈ ప్రచారం 22 కోట్ల మంది ముస్లిములను విలన్లుగా చిత్రీకరించడానికి ఉద్దేశించిన ప్రచారం. బిజెపి రాజకీయ అజెండాకు అనుగుణంగా మతతత్వ రాజకీయాల కోసం చేసిన ప్రచారం ఇది.

జాతి ఆధిపత్య భావనను ప్రచారం చేసే "మెయిన్ కాంఫ్" పుస్తకాల అమ్మకాలు భారతదేశంలో ఎక్కువగా ఉన్నాయన్నది గమనిస్తే భారతదేశంలో హిట్లర్ పట్ల ఎంత అభిమానం ఉందో తెలుస్తుందని రాసింది. నేడు, చాలామంది మతతత్వవాదులు ఇజ్రాయెల్‌కు ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు బలమైన మద్దతుదారులు, నెతన్యాహును మోడీ సన్నిహితమిత్రుడిగా భావిస్తారు. ఇజ్రాయెల్ భారతదేశం రెండింటికి ఉమ్మడి శత్రువుతో పోరాడటానికి ఇజ్రాయెల్ రక్షణ దళాలలో చేరుతామంటూ కొందరు న్యూఢిల్లీ లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం బయట ర్యాలీ కూడా తీశారు.

భారతదేశం చారిత్రకంగా పాలస్తీనా విషయంలో సంఘీభావం ప్రకటిస్తున్న దేశం. కాని ఇప్పుడు ఇస్రాయీల్‌కు లభిస్తున్న ఈ బలమైన మద్దతు భారతదేశం చారిత్రకంగా అనుసరిస్తున్న విధానాన్ని వదిలేసినట్లు చాటి చెబుతోంది. 1974లో పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్‌ను పాలస్తీనా ప్రజల ఏకైక, చట్టబద్ధమైన ప్రతినిధిగా గుర్తించిన మొదటి అరబేతర దేశం భారతదేశం. ఏదేమైనా, మోడీ బిజెపి ఇజ్రాయెల్‌ను ఆలింగనం చేసుకుంది. జియోనిస్టులు యూద రాజ్యాన్ని సృష్టించుకున్నట్లే చాలా మంది హిందూ రాజ్యం కావాలనుకొంటున్నారు. అందువల్లనే ఇస్రాయీల్ పట్ల ఈ అభిమానం.

ఇజ్రాయెల్‌కు బిజెపి మద్దతులో ఒక వైరుధ్యం ఉంది. ఎందుకంటే తరచుగా స్వస్తిక్‌ను లేదా హిట్లర్ చిత్రాలను ప్రదర్శించే ఈ శక్తులు ఇప్పుడు ఇజ్రాయెల్ ను ప్రశంసిస్తున్నారు. భారతదేశంలో ఇస్లామోఫోబిక్ ద్వేషం గరిష్ట స్థాయికి చేరుకొంటున్న కాలంలో ఇజ్రాయెల్-గాజా యుద్ధం జరుగుతోంది. తప్పుడు సమాచారం, ఫేక్ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నకిలీ వీడియోలు, ప్రభుత్వ అనుకూల సోషల్ మీడియా పేజీలు ముస్లింల సామాజిక బహిష్కరణను ప్రోత్సహిస్తు న్నాయి. ఇజ్రాయెల్‌కు బిజెపి మద్దతును ఇస్లామోఫోబిక్ రాజకీయాల కోణంలో చూడాలి. ముఖ్యంగా బఎఎయప్త్రసాధారణ ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు, లోక్ సభలో ప్రతి ఒక్క సీటు ముఖ్యమైనదిగా మారినప్పుడు ఈ రాజకీయా లను మరింత నిశితంగా గమనించడం అవసరం

తుదిగేటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**